

వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్

వేణుగోపాల్‌తో రాజకీయ మంతనాలు

బెంగళూరు (యశ్వంపుర), న్యూస్‌టుడే : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉదయం ముఖ్య మంత్రి సిద్ధరామయ్యను ఆయన నివాసంలో కలిసి వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివ కుమార్, తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పార్లమెంట్ ప్రజాపద్దుల స్థాయి సమితి సమావేశంలో పాల్గొనేందుకు ఆయన దిల్లీ నుంచి బెంగళూరు నగరానికి విచ్చేశారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు భాజపా చేస్తున్న ఆరోపణలు, పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో విధాన సభ ఎన్నికలు అంశాలను వారు చర్చించారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా భాజపా చేసిన ఆరోపణలు, కాంగ్రెస్‌పై వాటి ప్రభావం.. ప్రస్తావించినట్లు సమాచారం.

మరో ఫిర్యాదు : చట్టానికి వ్యతిరేకంగా రూ.400 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని డి.నోటిఫై చేసిన ముఖ్య మంత్రి సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవా లని భాజపా బెంగళూరు దక్షిణ నగర జిల్లా మాజీ అధ్య క్షుడు ఎన్.ఆర్.రమేష్ బుధవారం లోకాయుక్త అధికారు లకు ఫిర్యాదు చేశారు. నగరంలోని ఆర్ఎంవీ లేఔట్‌లో బీడీఏ స్వాధీనం చేసుకున్న ఆరు ఎకరాల భూమిని డి. నోటిఫై చేశారని ఆరోపించారు. భూపసంద్ర సర్వే నెం: 20లో 3.34 ఎకరాలు, సర్వేనెం:34లో 2.32 ఎకరాల భూమిస్వాధీనం చేసుకున్న బీడీఏ అధికారులు.. యజమా నికి చెల్లించాల్సిన పరిహార మొత్తాన్ని నగర సివిల్ న్యాయ స్థానంలో డిపాజిట్ చేశారని గుర్తు చేశారు. అన్ని నిబం ధనలూ గాలికి వదిలేసి ఆ భూములను కేటాయించారని, దానిపై విచారణ చేపట్టాలని కోరారు.

అద్భుత పథకం!

- ప్రాజెక్టు పేరు : కావేరి 5వ దశ
- ప్రాజెక్టు పూర్తయిన కాలం : పదేళ్లు(2014 జూన్‌లో ప్రారంభం)
- మొత్తం వ్యయం : రూ.4,336 కోట్లు
- నిధులు సమకూర్చిన సంస్థ : జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ ఏజెన్సీ- 84 శాతం)
- రాష్ట్ర ప్రభుత్వం : 16 శాతం
- 5వ దశతో అదనపు నీటి లభ్యత : 775 ఎంఎల్‌డీ (10టీఎంసీలు)
- నగరానికి అందే మొత్తం నీరు : 2,225 ఎంఎల్‌డీ
- లబ్ధిపొందే అదనపు ప్రాంతాలు : యశ్వంతపుర, రాజరాజేశ్వరినగర, దాసరహళ్లి, మహదేవపుర, బ్యాటరాయనపుర, బెంగళూరు దక్షిణ, బొమ్మనహళ్లి
- లబ్ధి పొందే అదనపు గ్రామాలు : 110
- 5వ దశతో కావేరి నీరు పొందే ఇళ్లు : 14.64 లక్షలు (ప్రస్తుతం 10.64లక్షలు)

రాజధానికి కావేరి జలభాగ్యం

- తీరనున్న 110 గ్రామాల దాహార్తి
- ఆరో దశ డీపీఆర్‌కూ పచ్చజెండా

ఈనాడు, బెంగళూరు : రాజధాని.. బెంగళూరు నగరం గత వేసవిలో ఎదుర్కొన్న నీటి సమస్య నేటికీ ప్రజల కళ్లలో కదలాడుతోంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ నగరం దేశంలోనే పేరెన్నికగన్నది. ప్రపంచ స్థాయి ఐటీ, అంకుర, నవ్యాలోచనల పర్యావరణ వ్యవస్థ, ఉన్నత విద్యకు కేంద్రంగా విరాజిల్లుతోంది. భారతీయుల సిలికాన్ వ్యాలీగానూ పేరొందినా మౌలిక సదుపాయాల లేమితో విమర్శలు ఎదుర్కొంది. 400 ఏళ్ల కిందటే పునాదిరాయి పడిన బెంగళూరు మునుపెన్నడూ లేనంతగా గత వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంది. ఐటీ ఉద్యోగులు సైతం నీటి కొరత కారణంగా సొంత ఊళ్లకు వెళ్లి విధులు నిర్వహించాల్సి వచ్చింది. గత ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ట్యాంకర్లే రాష్ట్ర రాజధాని గొంతు తడిపాయి. నగరం ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యపై సామాజిక మాధ్యమాల్లో మీమ్స్, ఎక్స్‌లో వ్యంగ్యాస్త్రాలు వెల్లువెత్తాయి. ఇంతటి విమర్శను ఎదుర్కొన్న సర్కారు ఎట్టకేలకు నగర నీటి సమస్యను పరిష్కరించేందుకు మహత్తరమైన అడుగు వేసింది. రానున్న పదేళ్ల వరకు నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేసే కావేరి 5వ దశ ప్రాజెక్టును బుధవారం ప్రారంభించింది. పదేళ్లు కొనసాగిన ఈ ప్రాజెక్టు పనులు ఇటీవలే పూర్తవగా ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు తమ మంత్రి వర్గ బృందం, ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేసిన జైకా సంస్థ ప్రతినిధులు, జపాన్ రాయబారులతో కలిసి ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారు. మండ్య జిల్లా మళవళ్లి తాలూకా తొరెకాడనహళ్లి జలమండలి ఆవరణలో ఆవిష్కరించిన ఈ ప్రాజెక్టు విశేషాలు నిపుణుల ఘనతను చాటుతున్నాయి.



గలగలపారే కావేరి.. మండ్య జిల్లా నుంచి ఉద్యాననగరిదాకా కదలివస్తున్న ఘన వైభవం

50 ఏళ్లలో 5వ దశ..

బెంగళూరులో 1896లో నీటి సమస్య తొలిసారి తలెత్తింది. అప్పటి వరకు చుట్టుపక్కల విస్తరించిన తటాకాలు, బావులు, కొలనుల ద్వారా నీటిని వాడుకునేవారు. ఆ ఏడాది సమస్య ఎదురు కావడంతో ధర్మాంబుధి, సంపంగి, హలసూరు, స్యాంకి చెరువుల వ్యవస్థలు అందుబాటులోకి తెచ్చారు. అదే ఏడాది నగరంలో ప్రవహించే అర్కావతి నది నుంచి నీటిని వాడే వ్యవస్థ ప్రారంభమైంది. క్రమంగా నగరం విస్తరించే కొద్దీ నీటి వనరులు తగ్గుతూ 1974 నాటికి ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ ప్రారంభమైంది. అలా రాష్ట్ర రాజధానికి కనిపించిన వ్యవస్థే కావేరి ప్రాజెక్టు. అప్పటి నుంచి 2024 అక్టోబరు వరకు నాలుగు దశల్లో బెంగళూరుకు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం 800 చదరపు కిలోమీటర్లకు విస్తరించిన బెంగళూరు నగరానికి 2023లో మరో 110 గ్రామాలను చేర్చాలన్న ప్రతిపాదన రావటం, వాటిని బీబీఎంపీలోనికి విలీనం చేసే ప్రక్రియ కూడా ముగిసింది. సరిగ్గా ఇదే సమయంలో తాగు నీటి సమస్య తీవ్ర స్థాయికి చేరుకుంది. 50 ఏళ్ల కిందట కేవలం పది లక్షలుగా ఉన్న బెంగళూరు జనసంఖ్య ప్రస్తుతం 1.50 కోట్లకు చేరువైంది. పెరిగిన జనసంఖ్యకు అవసరమైన నీరు అందించాలంటే నగరానికి కనీసం 2,220 ఎంఎల్‌డీల నీటి వ్యవస్థ అవసరం. ప్రస్తుతం 1,450 ఎంఎల్‌డీల నీరు మాత్రమే నగరానికి అందుతోంది. మిగిలిన నీటి కోసం బోరు బావులపై ఆధారపడుతున్నారు. గత వేసవిలో నగరంలోని ఏడు వేల బోరు బావుల నీరు ఇంకి పోవటంతో హాహాకారాలు మొదలయ్యాయి. ఈ సమస్యే 5వ దశ పనులకు మరింత వేగాన్ని అందించింది. పదేళ్ల కిందట మొదలైన కావేరి ఐదో దశ ప్రాజెక్టు అక్టోబరు 16న మోక్షం లభించి నగరానికి సమృద్ధిగా నీరు దక్కేలా చేసింది.

సిద్ధుతో షురూ..

2014లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన సిద్ధరామయ్య ఐదో దశ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. తర్వాత ఆయనే ఆవిష్కరించారు. రెండు దశల్లో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుకు జైకా సంస్థ ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. మొత్తం రూ.4,336 కోట్ల వ్యయంలో ఈ సంస్థ 84 శాతం, సర్కారు 16శాతం నిధులు అందించాయి. మండ్య జిల్లాలోని టీకే హళ్లి-హారోహళ్లి, తాతగుణిలో మూడు భారీ బూస్టర్ పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దాదాపు 450 మీటర్ల ఎత్తు వరకు నీటిని పంపింగ్ చేసే వ్యవస్థ తయారీ కోసం 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కును వినియోగించారు. 110 కి.మీ.ల దూరంలోని బెంగళూరు నగరానికి నీటిని తరలించే భారీ గొట్టాలను తయారు చేసేందుకు ఆధునిక ఇంజినీరింగ్ వ్యవస్థలను వినియోగించారు. భారత్‌లోనే అత్యంత పెద్ద ప్రాజెక్టుగా జలవనరుల శాఖ అభివర్ణించే ఐదో దశ ద్వారా 50 లక్షల మందికి అవసరమైన నీరు అందిస్తారు. బెంగళూరులోని ఉపనగరాల పరిధిలోని గొట్టిగెరె, దొడ్డకనహళ్లి, లింగధీరనహళ్లి, ఎస్.ఎం.వి. 6వ బ్లాక్, కాడుగొడి, చొక్కనహళ్లి జలాశయాలకు నీరు పంపి ఎనిమిది కొత్త విధానసభ క్షేత్రాల్లోని 110 గ్రామాలకు నీరు అందిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన రోజునే ఆరో దశ పనులకు డీపీఆర్ సిద్ధం చేయాలన్న ఆదేశాన్ని సర్కారు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా నగరానికి మరో 500 ఎంఎల్‌డీ నీరు అందుతుంది. కావేరి ఆయకట్టు ప్రజలకు విడుదల చేసి మిగిలిన ఆరు టీఎంసీల నీటిని బెంగళూరు నగరానికి అందించటమే కొత్త ప్రాజెక్టు లక్ష్యం.



తొరెకాడనహళ్లిలో కావేరి మాతకు పుష్పార్చన చేస్తున్న ముఖ్యమంత్రి



కావేరి ఐదో అంకం నీటి పథకం ఎత్తిపోతల నిర్మాణ ప్రాంగణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, దేశ, విదేశీ నిపుణులు

ఈడీపై నాగేంద్ర నిప్పులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అక్రమాలకు- తనకు ఎటువంటి సంబంధం లేదని మాజీ మంత్రి బి.నాగేంద్ర స్పష్టం చేశారు. ఈ అక్రమాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వాటా ఉందని చెప్పాలని తనపై ఈడీ అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి వేధించారని ఆరోపించారు. అరెస్టయిన మూడు నెలల అనంతరం న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంతో పరప్పన అగ్రహార కారాగారం నుంచి బుధవారం ఆయన విడుదలయ్యారు. ఈడీ ఇప్పటికే అభియోగపత్రాన్ని దాఖలు చేసిందని, విచారణకు హాజరై తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని నాగేంద్ర చెప్పారు.

మునిరత్నకు బంధ విముక్తి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : అత్యాచారం, హనీట్రాప్ కేసుల్లో ఆరోపణలతో అరెస్టయిన మాజీ మంత్రి, రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్నకు చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంతో పరప్పన అగ్రహార కారాగారం నుంచి బుధవారం విడుదలయ్యారు. ఆయన అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికి, వయ్యాలికావల్‌లోని నివాసానికి తీసుకువెళ్లారు. మిఠాయిలు పంచి పెట్టి, బాణసంచా కాల్చి వేడుకలు చేసుకున్నారు.

చాముండి ప్రాధికారకు కోర్టు దిశా నిర్దేశం

మైసూరు, న్యూస్‌టుడే : చాముండేశ్వరి ఆలయం నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీచాముండేశ్వరి క్షేత్ర అభివృద్ధి ప్రాధికారకు స్థిర, చరాస్తులను వితరణ చేయవద్దని ఉన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. ప్రాధికార నిర్వహించే అన్ని సభల్లో రాజమాత ప్రమోదాదేవిని ఆహ్వానించాలని న్యాయస్థానం సూచించింది. ఒకవేళ ఆమె సభల్లో పాల్గొనకపోతే చట్ట ప్రకారం ప్రాధికార తదుపరి నిర్ణయాన్ని తీసుకునేందుకు అవకాశం ఉంటుందని న్యాయమూర్తి ప్రకటించారు.

లోకాయుక్తకు ఫిర్యాదు

మైసూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో అక్రమాలకు పాల్పడ్డారని గవర్నర్, లోకాయుక్తలకు ఫిర్యాదు చేసిన సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేపీసీసీ అధికార ప్రతినిధి ఎం.లక్ష్మణ్ ఆరోపించారు. తనపై క్రిమినల్ కేసులు ఉన్నప్పటికీ, ఇతర నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని లోకాయుక్తకు బుధవారం ఫిర్యాదు చేశారు. కేసును నిర్వీర్యం చేసేందుకు కొందరు లోకాయుక్త అధికారులను మభ్యపెట్టడం, బెదిరించడం చేస్తున్నారని తనపై కృష్ణ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని లక్ష్మణ్ ఆక్రోశించారు.

చాక్లెట్లు 'మత్తు'.. తింటే చిత్తే

బెంగళూరు (శివాజీనగర): ఒంటరిగా వెళుతున్న ప్రయాణికులతో పరిచయం పెంచుకుని, వారికి మత్తు పదార్థాన్ని నింపిన చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి, నగలు, నగదు దోచుకుని పరారవుతున్న లత అనే మహిళను బ్యాటరాయపుర ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మత్తు ఇచ్చి నిలువు దోపిడీకి ప్రయత్నిస్తున్న ఆమెను కొందరు ప్రయాణికులు పట్టించి పోలీసులకు అప్పగించారు. ఠాణాకు తీసుకువచ్చిన అనంతరం తన వద్ద ఉన్న ఒక విష లేపిత చాక్లెట్‌ను నోట్లో వేసుకుని.. కిందపడిపోయింది. ఆమెను విక్టోరియా ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. నిందితురాలికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. నిందితురాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినట్లు వెల్లడించిన పోలీసులు.. పూర్తి వివరాల కోసం ఆరాతీస్తున్నారు.

వాడలపై ఉరిమిన వరుణుడు

- తీర పర్యాటకంపై నిషేధం
- హెచ్ఏఎల్‌లో 89.3 మిమీ వర్షం



యలహంకలో నీటిపాలైన కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ వాసులను ట్రాక్టర్లలో తరలింపు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఎడతెరిపిలేని వానలు కన్నడనాడును ముప్పుతిప్పలు పెడుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనంతో 12 జిల్లాల్లో ఆరంజ్ అలర్ట్ ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు బుధవారం వెల్లడించారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చిక్కబళ్లాపుర, చిక్కమగళూరు, హాసన, కోలారు, మండ్య, రామనగర, శివమొగ్గ, తుమకూరు, ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో గురువారం మధ్యాహ్నం వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని ప్రకటించారు. ఉత్తర కన్నడ, బళ్లారి, చామరాజనగర, చిత్రదుర్గ, దావణగెరె, కొడగు, మైసూరు, విజయనగర జిల్లాల్లో ఎల్లో అలర్ట్ కొనసాగుతుందని తెలిపారు. మంగళవారం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు బెంగళూరులో 66.1 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, హెచ్ఏఎల్ పరిధిలో ఎక్కువగా 89.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. కలబురగి జిల్లాలో 45.5 మి.మీ. వర్షం కురిసింది. అరేబియా సముద్రంలోకి శనివారం వరకు చేపలవేటకు వెళ్లకుండా నిర్బంధాన్ని విధించారు. తీర ప్రాంతాలకు పర్యాటకులు రావద్దని దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లా పాలన యంత్రాంగం కోరింది. గుండ్లుపేట తాలూకా హొన్నహెట్టర హుండి గ్రామంలో చెరువు కట్ట తెగడంతో వరద నీరు పొలంలోకి, ఇళ్లలోకి ప్రవహించింది. రెండు నెలల్లో చెరువు కట్ట తెగడం ఇది రెండోసారి. ధార్వాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఉల్లిపంట దెబ్బతింది. బెళగావిలో ఉదయం నుంచి తెరపి ఇవ్వకుండా కురుస్తున్న వర్షం జల్లుల్లోనే నగరవాసులు తమ పనులు పూర్తి చేసుకునేందుకు ప్రయత్నించారు.

ఉద్యాననగరిలోనూ....

వరుసగా కురుస్తున్న భారీ వర్షం, జడివానతో ఉద్యాననగరి మరింత చల్లగా మారింది. భారత్- న్యూజిల్యాండ్ మధ్య మొదటి టెస్టు మొదటిరోజు ఆటను వీక్షించేందుకు గొడుగులతో వచ్చిన ప్రేక్షకులు నిరాశతో వెనుతిరగవలసి వచ్చింది. వర్షం కాస్త తెరపి ఇచ్చిన సమయంలో ప్రధాన రహదారుల్లో వాహన రద్దీ కనిపించింది. పెద్ద గొడుగులు, రెయిన్ కోట్ల విక్రయాలు జోరుగా కొనసాగాయి. కావేరినగర సాయి లేఅవుట్ మొత్తం జలమయంగా మారింది. రహదారులపై మోకాలి లోతు నీరు ఉండగా, దిగువ అంతస్తులన్నీ మడుగులుగా మారాయి. తాగు నీటి డబ్బాలను స్థానికులు కొనుగోలు చేసుకున్నారు. అతిసారం ప్రబలకుండా, నీటిని వడగట్టి, కాచి చల్లార్చి తాగాలని ఆరోగ్య శాఖ అధికారులు ప్రచారం చేశారు. మహదేవపుర విభాగంలో ఒక యువకుడు వర్షం నీటిలో కొట్టుకుపోతుంటే బెస్కాం ఉద్యోగులు రక్షించారు. కేఆర్‌మార్కెట్, ఒకలిపుర, పణత్తూరు, బెళ్లందూరు చెరువు రోడ్డు పరిధిలోని పలు బిలమార్గాల్లో నాలుగు అడుగుల ఎత్తులో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



బెంగళూరు సాయి లేఅవుట్‌లో నీటలో మహిళల ఇక్కట్లు

రాజకీయ అలజడి

- 'బ్రాండ్ బెంగళూరు' అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం ప్రజలకు కలుగుతున్న ఇబ్బందిపై ఏం బదులిస్తుందని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ట్వీట్ చేసి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేను ఆకాశాన్ని, ప్రకృతిని నియంత్రించలేనని, ఉద్దేశపూర్వకంగా బెంగళూరు మర్యాద తీయవద్దని కుమారను ఉద్దేశించి డీకే శివకుమార్ వ్యాఖ్యలు చేశారు. దానికి బదులుగా భాజపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే కురిసిన భారీ వర్షంతో రహదారులపై నీరు నిండిందని గుర్తుచేశారు. ఆ నీటిలో నిలబడి యువ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ నలపాడ్ చేసిన ఆందోళన వీడియోను జనతాదళ్ నేతలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అప్పుడు కూడా ప్రకృతి విపత్తు సంభవిస్తే మీరు ఎందుకు రాజకీయం చేశారంటూ శివకుమార్‌ను ఉద్దేశించి ప్రశ్నలు గుప్పించారు.



మాన్యతా టెక్‌పార్కు : రహదారిపై నుంచి దూకుతున్న నీరు



బెంగళూరు చిన్నస్వామి క్రికెట్ మైదానాన్ని బుధవారం ఉదయం చుట్టుముట్టిన వానమబ్బులు

కాలువలో పడి బాలుడి మృతి

విజయపుర, న్యూస్‌టుడే : భారీ వర్షంతో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయని, దానిపై ఉన్న బండరాయిని బడికమాన్ రోడ్డులో తొలగించారు. ఇంట్లో నుంచి ఆడుకుంటూ వచ్చిన యాసిన్ సద్దాం ముల్లా అనే రెండేళ్ల బాలుడు ఆ కాలువలో పడి నీటిలో కొట్టుకుపోయిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాలుని మృతదేహాన్ని బుధవారం ఉదయం కాలువ నుంచి బయటకు తీశారు.

రేణుకాస్వామికి పుత్రయోగం



రేణుకాస్వామి, సహన (పాతచిత్రం)

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : ఆ దంపతులది ఓ విషాదగాథ. తాను ఎంతగానో అభిమానించే కథానాయకుడు దర్శన్, ఆయన ప్రియురాలు దర్శన్ చేతిలో రేణుకాస్వామి కడతేరిపోయాడని పోలీసులు నమోదు చేసుకున్న కేసు రాష్ట్రంలో పెను సంచలనం సృష్టిస్తున్న క్రమంలో ఈ అంశంలో మరో అంకం ప్రజలను కదలించింది. స్వామి మరణించే నాటికి ఆయన భార్య సహన ఐదు నెలల గర్భిణి. కొత్తగా పెళ్లైన ఆ జంటకు తోడుగా ఓ చిన్నారి ఒడిలోకి వచ్చివాలే సమయంలో విషాదం చోటుచేసుకుంది. భర్త మరణాన్ని పంటి బిగువన బిగించి జీవితాన్ని నెట్టుకొచ్చిన ఆమె.. బుధవారం ఓ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి-బిడ్డ క్షేమంగా ఉన్నట్లు చిత్రదుర్గంలో ఆమెకు వైద్యసేవలందించిన డాక్టర్ మల్లికార్జున విలేకరులకు వివరించారు. మానవతా దృష్టితో ఆమె ప్రసవానికి వెచ్చించిన ఖర్చును ఆస్పత్రి నిర్వాహకులు భరించడం ప్రస్తావనార్హం.



మెట్రోకు కుదుపు

జోరు వాన కారణంగా బెంగళూరులోని మెట్రో రైలు వ్యవస్థ తూర్పు-పడమటి కారిడార్ గులాబి మార్గం పట్టాలపై చెట్టుకొమ్మ విరిగిపడటంతో రాకపోకలు స్తంభించాయి. బుధవారం ఉదయం 6.05 గంటల సమయంలో ఎస్‌వీరోడ్డు నుంచి ఇందిరానగర మెట్రో ఉపరితల వంతెనపై కొమ్మ విరిగిపడింది. 8.05 గంటల వరకు రైళ్లు నిలిచిపోయాయి. బీఎంఆర్‌సీఎల్ అధికారులు అక్కడికి వచ్చి చెట్టు కొమ్మలను తొలగించి రైలు సంచారానికి అనుమతించారు.

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

అక్కడ సురేశ్ పోటీ..

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా డీకే సురేశ్ పోటీ చేసేందుకు అవకాశాలున్నాయని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. చెన్నపట్టణలో ఎన్నికల ప్రచార బాధ్యతలను పార్టీ తనకూ అప్పగించిందని చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో సురేశ్ గెలిచి, తమతో పాటు శాసనసభలో అడుగు పెడతారన్న నమ్మకం తనకు ఉందన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి తన కుమారుడు నిఖిల్ లేదా భార్య అనితా కుమారస్వామిని నిలబెట్టాలని కోరుకుంటున్నప్పటికీ, వారు ఓడితే పరిస్థితి ఏమిటా అని ఆలోచనల్లో పడినట్లు ఉందన్నారు. ఎవరు పోటీ చేసినా, సురేశ్ గెలుపు నల్లేరుపై నడక అవుతుందని పేర్కొన్నారు.

దర్శన్‌కు బెయిల్ ఎన్నడో?

బెంగళూరు (మల్లేశ్వరం): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన నటుడు దర్శన్ బెయిలు కోసం వేసుకున్న అర్జీని 57వ సీసీహెచ్ న్యాయస్థానం తోసిపుచ్చడంతో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దర్శన్ వెన్నునొప్పి సమస్యలను ఎదుర్కొంటున్నాడని, బెయిలు మంజూరు అర్జీని త్వరగా విచారించాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది సీవీ నాగేశ్ బుధవారం మెమో దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణ చేపట్టడం సాధ్యం కాదని పేర్కొన్న న్యాయస్థానం అక్టోబరు 22న ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

పోటెత్తిన భక్తులు

బెళగావి: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సవదత్తి రేణుకా యల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొమ్మిది రోజుల్లో 21 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గతంలో ఎన్నడూ దసరా సమయంలో ఇంత సంఖ్యలో భక్తులు ఆలయానికి రాలేదు. ఆలయంలో అమ్మవారి ముందు దీపాలను వెలిగించేందుకు భక్తులు 16,200 కిలోల నూనెను అందజేశారు. అవసరానికి కావలసిన నూనెను ఉంచుకుని, మిగిన నూనెను వేలం ద్వారా విక్రయిస్తామని అర్చకుడు రాజు పాటిల్ తెలిపారు. దీపం నూనె విక్రయాలతో కనీసం రూ.9.39 లక్షల నగదు ఆలయానికి సమకూరుతుందని ఆయన చెప్పారు.

పడిపోయిన టమాటా ధర

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ఈనెల మొదటి వారంలో కిలో రూ.60 పలికిన టమాటా.. దసరా పండగ సమయానికి రూ.100కు ఎగబాకి.. బుధవారం ఒక్కసారిగా కిలో రూ.16.60కు పడిపోయింది. చిక్కబళ్లాపుర ఏపీఎంసీ మార్కెట్ యార్డులో గత వారాంతంలో 15 కిలోల టమాటా బాక్సు రూ.1000 ఉండగా, బుధవారం అదే బాక్సు రూ.250కు విక్రయించడం ప్రస్తావనార్హం.

జై శ్రీరాం అంటే తప్పేముంది?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మసీదు సమీపంలో 'జై శ్రీరాం' అని నినాదాలు చేస్తే ఎవరి ధార్మిక భావనలూ దెబ్బతినవని జస్టిస్ ఎం.నాగప్రసన్న పేర్కొన్నారు. దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకాలోని ఒక మసీదు ఆవరణలోకి వచ్చిన కీర్తన్, సచిన్ అనే యువకులు 'జైశ్రీరాం' అంటూ నినాదాలు చేశారు. మత పెద్దల ఫిర్యాదుతో కడబ ఠాణాలో వారిపై కేసు నమోదైంది. వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయనిర్బంధానికి పంపిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. ఆ ఆదేశాలను ప్రశ్నిస్తూ వారిద్దరూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కడబ, చుట్టుపక్కల ప్రాంతాల్లో హిందూ, ముస్లింలు స్నేహంతో జీవిస్తున్నారని, మసీదు ఆవరణ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒక ధర్మానికి చెందిన నినాదాలు చేయడం ధార్మిక నమ్మకాలు, భావనలను అవమానించడం కిందకు రాదని ప్రకటించిన న్యాయమూర్తి, వారిని కారాగారం నుంచి విడుదల చేయాలని ఆదేశించారు.

నవంబరు 13న సండూరు ఉప ఎన్నిక

ఏర్పాట్లను పూర్తి చేశామన్న డీసీ


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి, జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఏసీ ప్రమోద్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా సండూరు నియోజకవర్గం ఉప ఎన్నిక నవంబరు 13న జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2023 విధానసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఇ.తుకారామ్ లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఖాళీ అయిన ఎమ్మెల్యే స్థానానికి జాతీయ ఎన్నికల కమిషన్ మంగళవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. 25న నామినేషన్లు సమర్పించడానికి చివరి తేదీ, 28న నామినేషన్ల పరిశీలన, 30న వాటిని ఉపసంహరించుకోవడానికి చివరి తేదీ అని తెలిపారు. 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని వివరించారు.

253 పోలింగ్ కేంద్రాలు

సండూరు నియోజకవర్గంలో మొత్తం 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీసీ తెలిపారు. సండూరు తాలూకాలో 230 పోలింగ్ కేంద్రాలు, తాలూకాలోని వేణివీరాపురం-2, కుడతిని పురసభలో-16, కురుగోడు తాలూకాలోని తిమ్మాలాపురంలో-2, ఏళుబెంచి గ్రామంలో-03 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో పట్టణ ప్రాంతంలో 68, గ్రామీణ ప్రాంతాల్లో 185 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 253 పోలింగ్ కేంద్రాల్లో 55 సూక్ష్మ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు.

ఎన్నికల సిబ్బంది

సండూరు నియోజకవర్గం ఉప ఉన్నిక శాంతియుతంగా, పారదర్శంగా నిర్వహించడానికి తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు డీసీ వివరించారు. 20 మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. జిందాల్ విమానాశ్రయంలో రెండు, చిత్రదుర్గం జిల్లా సరిహద్దు మెటలకుంట గ్రామం, విజయనగర జిల్లా సరిహద్దులోని కొండపురం, వెంకటగిరి గ్రామాల సరిహద్దు, కూడ్లిగి తాలూకా శ్రీరామశెట్టి హళ్లి వద్ద మొత్తం నాలుగు చెక్‌పోస్టులు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని బసపుర, గంగలాపుర గ్రామాల వద్ద రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో అవసరాలను బట్టి మరిన్ని చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామని డీసీ తెలిపారు. మొత్తం 1235 మంది సిబ్బందిని ఎన్నికకు ఉపయోగిస్తున్నాం. వారిలో పీఆర్‌వో-304 మంది, ఏపీఆర్‌వో-304 మంది, పీవో-608 మందిని నియమించామన్నారు.

మొత్తం ఓటర్లు 2,36,100

సండూరు నియోజకవర్గంలో మొత్తం 2,36,100 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పురుషులు-1,17,739 మంది, మహిళలు 1,18,279 మంది, ఇతరులు-29 మంది ఓటర్లు ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 53, మొత్తం 2,36,100 మంది ఓటర్లు ఉన్నట్లు డీసీ వివరించారు. పురుషుల కంటే మహిళలు 540 మంది ఎక్కువగా ఉన్నారు. 1000 మంది పురుషులకు 1005 మంది మహిళలు ఉన్నారు. మొత్తం జనాభాలో పురుష ఓటర్లు 61.40శాతం, మహిళలు 64.23 ఓటర్లు మొత్తం 62.78 శాతం ఓటర్లు ఉన్నారు.

344 మంది సిబ్బంది

సండూరు నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి మొత్తం 344 మంది పోలీస్ అధికారులు, పోలీసులను ఉపయోగిస్తున్నట్లు ఎస్పీ శోభారాణి తెలిపారు. మొత్తం ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. వీటిలో రెవెన్యూశాఖ, పోలీసులు, ఇతరశాఖల సిబ్బంది ఉంటారు. ప్రతి చెక్‌పోస్టులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని నియంత్రణ గదికి అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. సండూరు నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచడానికి స్వీప్ సమితి నేతృత్వంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర తెలిపారు. ఏడీసీ మహమ్మద్ ఝుబేర, బళ్లారి ఉప విభాగం ఏసీ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు పార్టీలు సహకరించాలి

బళ్లారి : సండూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక తేదీని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. నిబంధనలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీ నేతలు అధికారులతో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా కోరారు. బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల అధికారి మాట్లాడుతూ బహిరంగ సభలు, సమావేశాలు, వేడుకలు, ర్యాలీలు, ప్రభుత్వ భవనాలు ఉపయోగం, వాహనాల వినియోగం, తదితర వాటికి సంబంధించిన అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల నిబంధనలు రాజకీయ పార్టీల నేతలు పాటించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో సండూరు తాలూకాలో ఉన్న వివిధ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాహనాలకు బోర్డులు, ఇతర పార్టీలకు చెందిన బ్యానర్లు తదితర వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. సండూరు నియోజకవర్గం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ర్యాలీలు, సభలు, సమావేశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. సండూరు నియోజకవర్గంలో పలు పరిశ్రమలు ఉన్నాయి. ప్రతి కార్మికుడు పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లా పోలీస్ అధికారి శోభారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక జరగనున్నాయి. రాజకీయ పార్టీల నేతలు పోలీసులతో సహకరించాలి, గత విధానసభ, లోక్‌సభ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి సహకరించారు. అదే తరహాలో సహకరించాలని కోరారు. సమావేశంలో ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఏసీ ప్రమోద్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీ నేతలు పాల్గొన్నారు.

జిల్లాలో అయిదు ఇందిరా క్యాంటీన్లు: మంత్రి తంగడగి


కనకగిరిలో మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడగి

కారటగి: పేద, బడుగు వర్గాలు, కార్మికులకు తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందించాలన్న తలంపుతో 2017లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్ల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం కొప్పళ జిల్లాలోని కారటగి, కనకగిరి, భాగ్య నగర, కుకనూరు, కుష్టగిలో ఇందిరా క్యాంటీన్లు మంజూరయ్యాయని స్థానిక శాసనసభ్యుడు, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి తెలిపారు. కనకగిరి బస్టాండు ఎదురుగా రూ.87 లక్షలతో నిర్మించతలపెట్టిన ఇందిరా క్యాంటీన్ పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. అనంతరం ఆయన కనకగిరి - కారటగి మార్గంలో రూ.25 కోట్లతో నిర్మిస్తున్న 8 కిలోమీటర్ల రోడ్డు పనులు, ఒకటో వార్డులో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు హుసేన్‌బీ, ఉపాధ్యక్షుడు కంఠిరంగ నాయక్, తహసీల్దార్ విశ్వనాథ మురడి, నాయకులు వీరేశ్ సమగండి, సిద్ధప్ప నీరలూటి పాల్గొన్నారు.

26 నుంచి ఏఐయూటీయూసీ రాష్ట్ర సమ్మేళనం



గోడపత్రాలను విడుదల చేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్, చిత్రంలో డా.ప్రమోద్, సురేష్, శాంత

బళ్లారి, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్ (ఏఐయూటీయూసీ) 4వ రాష్ట్ర సమ్మేళనం ఈ నెల 26 నుంచి రెండు రోజులపాటు మైసూరు మహారాజ కళాశాల సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే సమ్మేళనంలో 300 మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 26న సాయంత్రం 5 గంటలకు జరిగే బహిరంగ సమావేశానికి 5వేలమంది హాజరవుతారని చెప్పారు. సమ్మేళనాన్ని ఏఐయూటీయూసీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి శంకర్‌దాస్ గుప్త, రాష్ట్ర సమితి సభ్యుడు సోమశేఖర్ యాదగిరి, చంద్రశేఖర్ మేటి, ఉగ్రనరసింహగౌడ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన నూతన కార్మిక చట్టాలు రద్దు చేయడంతో భవిష్యత్తు ప్రణాళిక, కార్మికులకు కనీస వేతనం రూ.35,000, 8గంటల పాటు పనివేళలు, మహిళా కార్మికులకు రాత్రి విధుల నుంచి మినహాయింపు వంటి డిమాండ్లపై సమ్మేళనంలో చర్చిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు డా.ప్రమోద్, శాంత, సురేష్ పాల్గొన్నారు.

గాడిద పాల కేసులో మరో ఇద్దరి అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు హర్షవర్ధన్‌రాజు, యోగానంద రెడ్డి

హొసపేటె, న్యూస్‌టుడే: జెన్నీ మిల్క్ కంపెనీ పేరిట గాడిద, వాటి పాలు విక్రయించి, రైతులను వంచించిన కేసులో మరో ఇద్దరు ఆంధ్రావాసులను బుధవారం కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా హొసపేటె పోలీసులు అరెస్టు చేశారు. వీరిని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమనగర్ చెందిన ఎన్.హర్షవర్ధన్‌రాజు, అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన గుర్రం యోగానందరెడ్డిగా గుర్తించారు. వీరి నుంచి రూ.10లక్షల విలువైన కారును స్వాధీనం చేసుకున్నారు. రైతుల నుంచి వసూలు చేసి, వీరి బ్యాంక్ ఖాతాల్లో వేసుకున్న రూ.36లక్షలను జప్తు చేశారు. జెన్నీ మిల్క్ గాడిద, పాలు విక్రయం కంపెనీలో వీరిద్దరూ ఉద్యోగులని చెప్పి రైతులను వంచించారని విలేకరుల సమావేశంలో విజయనగర ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేసులో మొత్తం ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

మద్యం దుకాణం తొలగించాలని నిరసన


మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న గ్రామ ప్రజలు

చెళ్లకెర, న్యూస్‌టుడే: తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ గౌరసముద్రంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద గ్రామ ప్రజలు, మహిళలు నిరవధిక ధర్నాను ప్రారంభించారు. బుధవారం ఆందోళనకారులు మద్యం దుకాణం వద్ద టైర్లకు నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. చెళ్లకెర తహసీల్దార్ రెహాన్ పాషకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామం నడిబొడ్డున మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో శాంతియుత వాతావరణం కోల్పోయినట్లు పేర్కొన్నారు. తాగిన మైకంలో యువకులు గ్రామంలో సంచరిస్తూ మహిళలు, పిల్లలపై దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. వెంటనే లైసెన్సును రద్దు చేసి దుకాణాన్ని మూసి వేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులు ధర్నా స్థలం వద్దనే వంట వండుకొని భోజనం చేశారు.


విలువలున్న ధారావాహికలు అవసరం



వెబ్ సిరిస్ లోగో ఆవిష్కరిస్తున్న బసవభూషణ స్వామి, ఇతర ప్రతినిధులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కుటుంబ సమేతంగ వీక్షించే ధారావాహికలు చిత్రీకరిస్తే కుటుంబాలు, సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించిన వారవుతారని బసవమఠం బసవభూషణ స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో బుధవారం మెహబూబ్ బిదిరి దర్శకత్వంలో ఆర్ఎస్ఎం పేరు మీద చిత్రీకరిస్తున్న అగణి తదనుమాన (కుటుంబంలో అనుమానాలు) అనే వెబ్ సిరీస్ లోగోను ఇతర ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. చిట్కి హుసేన్‌సాబ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొత్త, కొత్త రంగాల్లో ప్రవేశించే వారిని ప్రోత్సహిద్దామని పేర్కొన్నారు. నగరసభ సభ్యుడు హుమాయున్, అబ్దుల్‌నబి, ఇతర ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా వార్తాధికారిగా ధనంజయప్ప


బాధ్యతలు చేపట్టిన అధికారి ధనంజయప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ సీనియర్ సంచాలకుడిగా అధికారి బి.ధనంజయప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ బాధ్య అధికారిగా ఉన్న గవిసిద్ధప్ప హొసమని రాయచూరు జిల్లాకు బదిలీ అయ్యారు. విజయనగరలో ఖాళీ ఉన్న స్థానంలో దావణగెరె అధికారి ధనంజయప్పకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

చిరుత సంచారంతో భయాందోళన

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: మొళకాల్మూరు తాలూకా రాంపురం బొమ్మలింగనహళ్లి రహదారిలో చిరుత సంచరించడాన్ని కూలీ కార్మికులు చూసినట్లు గ్రామ పంచాయతీ సభ్యుడు తిప్పేశ్ తెలిపారు. బుధవారం ఆయన అటవీ శాఖ అధికారులకు అందించిన సమాచారం మేరకు..రెండు రోజుల క్రితం చిరుత రహదారిని దాటి పోవడాన్ని చూసిన కార్మికులు చరవాణిలో వీడియో తీశారు. పశువులను మేపుకొని రావడానికి, వ్యవసాయ పనుల కోసం గ్రామ ప్రజలు పొలాలకు వెళ్లడానికి భయపడుతున్నట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే చిరుతలను పట్టుకోవడానికి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: వరకట్న వేధింపులు భరించలేక భార్య శోభారాణి ఆత్మహత్య చేసుకొన్న కేసులో నిందితుడు, భర్త మంజునాథ్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.40 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. బుధవారం ప్రభుత్వ న్యాయవాది సతీశ్ అందించిన వివరాల మేరకు.. హొసదుర్గం పట్టణం మారుతినగర్‌లో నివాసముంటున్న శోభారాణిని చన్నగిరి తాలూకా మెదుగొండనహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ్ 2020లో వివాహం చేసుకొన్నాడు. వివాహ సందర్భంలో మంజునాథ్‌కు 50 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాముల వెండి నగలు, రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. భర్త అదనపు కట్నం తేవాలని వేధించడంతో భరించలేక ఆమె రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి తల్లి నింగమ్మ చన్నగిరి పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. డీవైఎస్పీ ప్రశాంత్ మున్నోళి కేసును దర్యాప్తు చేసి నిందితుడు మంజునాథ్‌పై అభియోగ పత్రాన్ని కోర్టుకు సమర్పించారు. కేసును విచారించిన న్యాయమూర్తి హనుమంతప్ప అణ్ణయ్యనవర్ మంజునాథ్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కన్నడ రాజ్యోత్సవ నిర్వహణపై సమీక్ష


మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ ఝుబేర, చిత్రంలో అధికారి నాగరాజ

బళ్లారి, న్యూస్‌టుడే: కన్నడ రాజ్యోత్సవాన్ని సాంస్కృతిక ఉత్సవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయాలని ఏడీసీ మహమ్మద్ ఝుబేర అధికారులకు సూచించారు. అనంతపురం రహదారిలోని నూతన జిల్లా సంకీర్ణ భవనంలో కన్నడ రాజ్యోత్సవం ముందస్తు సమావేశంలో ఏడీసీ మాట్లాడారు. నవంబరు 1న నగరంలోని మున్సిపల్ క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరగౌడ పాల్గొని జెండా ఎగుర వేస్తారని చెప్పారు. సరిహద్దులో ఉన్న బళ్లారిలో కన్నడ రాజ్యోత్సవం ఆర్భాటంగా నిర్వహించేందుకు కన్నడ సంఘాలు పూర్తిగా సహకరించాలని కోరారు. బళ్లారిలో మొదట సారిగా కన్నడ అభివృద్ధికి శ్రమించిన వారిని గుర్తించి సన్మానం చేస్తారు. పురస్కారానికి ఎంపిక చేయడానికి ఏసీ అధ్యక్షతన సమితిని ఏర్పాటు చేస్తున్నాం. దీనికి సహకరించాలని ఏడీసీ కోరారు. స్తబ్ధచిత్రాల ఊరేగింపు ఉంటుందని, ఇందులో కళాబృందాలు, కళాకారులు పాల్గొంటారన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో కన్నడ జ్యోతి రథం జిల్లాకు చేరుకుంటుందన్నారు. రాజ్యోత్సవం సందర్భంగా బళ్లారి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా కన్నడ సినిమాలు మాత్రమే ప్రదర్శించాలన్నారు. కన్నడ సంస్కృతశాఖాధికారి నాగరాజ, జిల్లా స్థాయి అధికారులు, కన్నడ పర సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

మాన్వి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నిర్వహించే ఎన్నికకు సంబంధించి నామపత్రాలు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024-29 తాలూకా, యోజనా శాఖల డైరెక్టర్ స్థానాలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రమోద్ కులకర్ణి తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అవకాశముందన్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 21 వరకు ఉపసంహరణకు వీలుంది. 28న ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. తాలూకాలోని 21 శాఖలకు చెందిన 936 మంది ఓటర్లు 34 మంది డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.

ఆకాశానికి గండి..

రాజధానిలో అలజడి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలుప్రాంతాలు ముంపుపాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వానలు.. బుధవారం సాయంత్రం వరకూ ఆగనేలేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం నగరంపై తీవ్రంగా పడింది. రోజుకు ఐదు మిల్లీమీటర్ల వర్షపాతం స్థానే.. 20 మిల్లీమీటర్ల వాన కురిసిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగనుంది. గురువారం తుపాన్ తీరం దాటే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ రాష్ట్ర సంచాలకుడు ఎస్.బి.పాటిల్ వెల్లడించారు. వర్షం కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఇంటినుంచి విధులు నిర్వహించాలని ఐటీ, బీటీ ఉద్యోగులకు ఆయా సంస్థలు సూచించాయి. వర్షంలో తడుస్తూ అనేక మంది ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. అత్యధికులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించడం ప్రస్తావనార్హం.

● యలహంక కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్లో మూడు అడుగుల స్థాయి వరకు వాననీరు నిలిచిపోయింది. అక్కడ ప్రజలను సమీపంలో ఉన్న ప్రైవేట్ వసతి గృహాలకు తరలించారు. రెండు రోజుల నుంచి అపార్ట్‌మెంట్ చుట్టూ నీరు నిలిచిపోయి ఇబ్బంది పెడుతోంది. ఆ ప్రాంతాన్ని పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ పరిశీలించి సహాయక చర్యలకు ఆదేశించారు. నిరుడు ముంపునకు గురైన కె.ఆర్.పురం ప్రాంతంలోని సాయి లేఔట్ ఇంకోసారి నిండా మునిగింది. అక్కడ 150 కుటుంబాల వారు వాననీటిలోనే కాలం గడుపుతున్నారు. యంత్రాల సాయంతో నీటిని బయటకు తోడేస్తున్నారు. యలహంక రమణశ్రీ లేఔట్‌లో నీరు నిలిచిపోయి, ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇందిరానగర 17వ డి-క్రాస్ ప్రదేశం ద్వీపంలా మారింది. పుష్కర కాలం నుంచి అక్కడ వానాకాలం ఇదే ఇబ్బందే. బళగెరె రహదారి వాగులా మారింది. సర్జాపుర రహదారి మునిగిపోయింది. మాన్యతా టెక్ పార్కు ముంగిట ఓ నిర్మాణం కోసం తవ్విన ప్రదేశంలో భూమి విరిగిపడింది. ప్రహరీ కూలిపోయింది. అక్కడ సంచార రద్దీ నెలకొంది. గంటల తరబడి వాహనాలు స్తంభించాయి. చిక్కబాణవార, ద్వారకనగర, గణపతినగర, మారుతినగర వాసులకు కడగండ్లే మిగిలాయి. రింగ్‌రోడ్డు, హెబ్బాళ్ కూడలి, హోసూరు మార్గ్, తుమకూరు రోడ్డుపై వాహనాలు కదల్లేని దుస్థితి ఎదురైంది. వర్షం కురిసే సమయంలో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.


బళగెరె రహదారి ముంపుపాలు.. రాకపోకలకు ఆటంకాలు


మహదేవపురలో విరిగిపడిన చెట్టు


మైసూరు మార్గ్‌లో వృషభావతి కాలువ జోరు


మునిగిన సాయి లేఔట్ ప్రాంతమిదీ


నీట మునిగిన యలహంక కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్


పణంతూరు రైల్వేవంతెన వద్ద నీటితో కష్టాలు


పాత మైసూరు బ్యాంకు కూడలి వద్ద వాహన రద్దీ

భక్తిశ్రద్ధలతో హోమ పూజలు

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక జైసంతోషిమాత దేవస్థానం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయ ప్రాంగణంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పూర్ణాహుతి, దుర్గా హోమ పూజలు చేశారు. హుబ్బళ్లికి చెందిన పండితులు జి.కె.సత్యమూర్తి సాన్నిధ్యంలో హోమ పూజలు జరిగాయి. జైసంతోషిమాత దేవస్థాన సమితి అధ్యక్షుడు ద్యాసనూరు రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి మన్నాలి వెంకయ్యశెట్టి, ఉపాధ్యక్షులు ఆర్.శివశంకరశెట్టి, ఎం.ఆర్.రాము, ఆర్యవైశ్య సముదాయం ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో రోడ్ల అభివృద్ధి


రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే చంద్రప్ప

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హొళల్కెరె తాలూకాలోని హలేహళ్లి లంబాణిహట్టి నుంచి మేకేనహళ్లి వరకు రూ.15.48 కోట్లతో రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు హొళల్కెరె ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప పేర్కొన్నారు. బుధవారం తాలూకాలోని గిలికేనహళ్లి గ్రామం వద్ద రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ రహదారి నిర్మాణంతో గరగ, అప్పసరనహళ్లి తదితర 10 గ్రామాలకు జిల్లా కేంద్రమైన చిత్రదుర్గానికి నేరుగా రహదారి సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. తాలూకాలోని చిక్కకెరె, మలసింగనహళ్లి, టి.ఎమ్మిగనూరు, శివగంగా, తాళ్య, హెచ్‌డి పుర, కెరెయాగళహళ్లి గ్రామాల చెరువులకు ఎత్తిపోతల ద్వారా నదీ జలాలను అందించడానికి రూ.105 కోట్ల అంచనా వ్యయంతో పథకాన్ని రూపొందిస్తామని తెలిపారు. బీఈవో శ్రీనివాస్, జీపీ అధ్యక్షురాలు విశాలమ్మ, గుత్తేదారు జైరామ్ పాల్గొన్నారు.

ఉషోదయాన పాలనాధికారి పట్టణ పర్యటన


సింధనూరు బసవవృత్తంలో తానే నిలబడి చెత్త ఏరిస్తున్న జిల్లాధికారి నితీశ్

సింధనూరు, న్యూస్‌టుడే: సమయం ఉదయం ఆరు గంటలు..అప్పటికి నడక పౌరులు తప్ప చాలా మంది నిద్ర లేచి ఉండరు. మరోవైపు రాయచూరు జిల్లాధికారి నితీశ్.కే మాత్రం రాయచూరులో ఎప్పుడు బయలుదేరారో..ఉదయం ఆరింటికల్లా సింధనూరు పట్టణ వివిధ కూడళ్లలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు చూస్తూ నిలుచున్నారు. అప్పటికి నగరసభ పౌరకార్మికులు తమ రోజూవారీ విధులు ప్రారంభించలేదు. విషయం తెలుసుకుని హుటాహుటిన నగర కమిషనర్ మంజునాథ్ రంగంలోకి దిగి సిబ్బందిని అప్రమత్తం చేశారు. పలు కూడళ్లలో చెత్త డబ్బాలు నిండిపోయి రాశులకొద్దీ చెత్త బయట రహదారిని ఆక్రమించిన దృశ్యాన్ని జిల్లాధికారి చూశారు. ఏమిటిదీ..అన్నట్లు కమిషనర్ ముఖం చూశారు. అక్కడున్న ఎవరి నుంచీ సమాధానం లేదు. పౌరకార్మికులతో చెత్తనంతటినీ ఎత్తించారు. అనంతరం ప్రయాణప్రాంగణం ఎదుట ఉన్న ఇందిరా క్యాంటీన్‌కు వెళ్లారు. అక్కడ శుచీ..శుభ్రతలు పరిశీలించారు. ఎప్పుడూ ఒక్కటేనా.. మెనూ మార్చమని అక్కడి నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఆపై డంపింగ్ యార్డ్‌కు వెళ్లి అక్కడి పరిస్థితిని చూశారు. అనంతరం తాగునీటి పంప్‌హౌస్‌కు వెళ్లారు. ఫిల్టర్‌బెడ్, క్లోరినేషన్ విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరసభలో అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. చివరిగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ పరిస్థితులు..జరుగుతున్న మరమ్మతు పనులను వీక్షించారు.


తాగునీటి పంప్‌హౌస్ వద్ద తుప్పు పట్టిన సామగ్రి గురించి వాకబు చేస్తున్న జిల్లా కలెక్టర్

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు

చాముండేశ్వరికి పూజలు


చాముండేశ్వరి దేవి

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి పట్టణంలోని జీన్‌గార కుటుంబం శారదమ్మ గోవిందప్ప నివాసంలో చాముండేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం పెద్ద ఎత్తున అన్న సంత ర్పణ ఏర్పాటుచేశారు. గురువారం పౌర్ణమి నాడు దేవికి ప్రత్యేక పూజలు, అఖండ భజన జరుగుతుంది. దాదాపు మూడు దశాబ్దాలుగా దసరా సమయంలో రెండు వారాలు దేవికి పూజలు, పట్టణ ప్రజలకు అన్న సంతర్పణ నిర్వహిస్తున్నామని శారదమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు.

ఖోఖోలో సిద్ధమ్మనహళ్లి విద్యార్థుల సత్తా

జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో కురుగోడు తాలూకా సిద్ధమ్మనహళ్లి మారుతి విద్యా కేంద్రం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి కలబురగి విభాగ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఖోఖో ఫైనల్‌కు సిద్ధమ్మనహళ్లి మారుతి విద్యాకేంద్రం జట్టు - సిరుగుప్ప తాలూకా నడివి మొరార్జీ దేశాయి పాఠశాల జట్టు పోటీ పడ్డాయి. చివరికి మారుతి విద్యా కేంద్రం జట్టు గెలుపొందింది. జట్టు కెప్టెన్ గౌతమి, ఆటగాళ్లు ఉమాదేవి, రేణుక, బిందు, జ్యోతిసాయిని, ఉషా, లత, వైష్ణవి, నాగవేణి, సంగీతలను ముఖ్య ఉపాధ్యాయులు రుద్రప్ప, తిమ్మప్ప అభినందించారు. - **న్యూస్‌టుడే, బళ్లారి**



మదరసా నిర్మాణానికి భూమిపూజ

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తొమ్మిదో వార్డులో మదరసా నిర్మాణానికి ముస్లిం ధర్మగురువు హజరత్ సయ్యద్‌షా మహమూద్ ఖాద్రి, హజరత్ సయ్యద్‌షా అయితురాబ్ ఖాద్రి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి. ప్రతి ఒక్కరూ సమాజ సేవా కార్యక్రమాల్లో తరచూ పాల్గొనాలని సూచించారు. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ముస్లిం సముదాయ నాయకులు కడికి వలిసాబ్, ఆక్బర్, యూసుస్, మహబూబ్, అబ్దుల్, షాబుద్దీన్, మునీర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం ధర్మగురువులు తదితరులు

రాజ్యోత్సవ పూర్వ సిద్ధతా సమావేశం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కర్ణాటక రాజ్యోత్సవం, కన్నడ జ్యోతి రథయాత్రలు రాక సందర్భంగా ముందస్తు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విశ్వనాథ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తాలూకా స్థాయి అధికారులు, సంఘ, సంస్థల ప్రతినిధులతో చర్చించారు. నవంబరు 1న నిర్వహించే కర్ణాటక రాజ్యోత్సవం, సిరుగుప్పకు సింధనూరు మార్గంలో వచ్చే కన్నడ రథయాత్ర స్వాగతం, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. అధికారులు, సంఘ, సంస్థల ప్రతినిధులు, సభ్యులు, కళాకారులు కలిసి రావాలన్నారు. తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి పవన్‌కుమార్, సీఐ హనుమంతప్ప, సీడీపీఓ ప్రదీప్, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నువ్వు లేక నేను లేను


చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: అనారోగ్యంతో భార్య మృతి చెందటంతో ఆమె ఎడబాటును భరించలేక భర్త ఆత్మహత్య చేసుకొని బలవన్మరణం చెందిన సంఘటన మొళకాల్మూరు పట్టణంలో బుధవారం రోజు రాత్రి జరిగిందని పోలీసులు తెలిపారు. శివణ్ణ(70), అతని భార్య గౌరమ్మ(60) దంపతులు రాజశేఖర్ అనే వ్యక్తి వద్ద మగ్గాలపై పట్టు చీరలను తయారు చేసేవారు. 15 సంవత్సరాల క్రితం తుముకూరు జిల్లా తిప్టూరు నుంచి వలస వచ్చి మొళకాల్మూరులోని ఎస్ఎంఎస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా పట్టు చీరల తయారీతో ఉపాధి పొందుతున్నారు. కొన్నేళ్లుగా గౌరమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. వ్యాధి తగ్గకపోవడంతో ఆమె మంగళవారం రాత్రి ఆమె మృతి చెందటంతో, ఇది భరించలేక శివణ్ణ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొన్నారని పోలీసులు చెప్పారు. బుధవారం మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని డీవైఎస్పీ రాజణ్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వసంత, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ పరిశీలించారు.

గనినాడులో మోస్తరు వర్షం


వర్షానికి తడుస్తూ ట్రాక్టర్‌లో వెళ్తున్న కూలీలు

బళ్లారి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో బళ్లారి నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. రహదారులపై వర్షపునీరు పరుగులు తీసింది. పలు రహదారులు బురదమయం అయ్యాయి. వర్షంతో నగర వాసులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి బళ్లారికి వచ్చిన వర్షంతో తడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి.

వాణిజ్య, పరిశ్రమల సంస్థ అధ్యక్షుడికి సన్మానం



బళ్లారి వాణిజ్య పరిశ్రమల సంస్థ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన యశవంత్‌రాజ్ నాగిరెడ్డిని హంద్యాళు మహదేవ తాత సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కళాకారుడు పురుషోత్తమ నేతృత్వంలో బుధవారం సన్మానం చేశారు. సంస్థ సభ్యులు రామచంద్రప్ప, మర్చేడు మల్లికార్జున, నాగహళ్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, బళ్లారి**

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

సిరుగుప్ప, న్యూస్‌టుడే: మహిళలు వివిధ వస్తువుల తయారీలో నైపుణ్య శిక్షణ పొంది స్వయం ఉపాధి సాధిస్తే ఆర్థికంగా బలోపేతం కావచ్చని వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.పాటిల్ పేర్కొన్నారు. జిల్లా, తాలూకా పంచాయతీ, వ్యవసాయ శాఖ, ఆత్మ యోజన సంయుక్త ఆధ్వర్యంలో బలకుంది గ్రామంలో బుధవారం మహిళా గుంపులకు కిసాన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ రంగంలో పరిశ్రమల స్థాపనపై శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇతర అతిథులతో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను వివిధ రకాలుగా సిద్ధం చేసి విక్రయిస్తే ప్రజలకు ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు అందించవచ్చన్నారు. ఆత్మయోజన అధికారి కవితా, నైపుణ్య శిక్షకురాలు సుమంగళ, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్ తయారీ, టమోటా కెచప్ తయారీపై శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సునితా రుద్రముని స్వామి, మహిళా గుంపు సభ్యులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు, అధికారులు

మాతా, శిశు ఆసుపత్రి తనిఖీ

మాన్వి, న్యూస్‌టుడే : జిల్లా పాలనాధికారి నితీశ్ బుధవారం సాయంత్రం పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులను ఆయన పరిశీలించారు. ఔషధాలయంలో మందులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో స్వచ్ఛత, తాగునీటి వ్యవస్థ, రోగులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సురేంద్రబాబు, తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవపాటిల్, వైద్యుడు శరణబసవ తదితరులు పాల్గొన్నారు.


రోగితో మాట్లాడుతున్న జిల్లాపాలనాధికారి నితీశ్

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

16-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1613.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	24,465	749
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	25,189	9358
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.788	45.562

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ప్రాంగణం.. ప్రహసనం


అపరిశుభ్రంగా కేఎస్ఆర్టీసీ బస్సు ప్రాంగణం

● కంపు కొడుతున్న కేఎస్ఆర్టీసీ నిలయం

● నిత్యం 450పైగా బస్సు సర్వీసుల రాకపోకలు


వ్యర్థాలతో నిండిన చెత్తబుట్ట వద్ద గేదె

నిత్యం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు 450కిపైగా బస్సు సర్వీసులు రాకపోకలు...వేలాది మంది ప్రయాణికుల సంచారం. ఇది విశాలమైన బళ్లారి కేఎస్ఆర్టీసీ కేంద్ర బస్సు ప్రాంగణం ప్రత్యేకత. అదే స్థాయిలో కంపు కొట్టే పరిసరాలు, అపరిశుభ్రత తాండవించే ప్రాంగణం, వ్యర్థాలు నిండిన చెత్తబుట్టలు.. పశువులు, కుక్కల సంచారంతో అభాసుపాలు తిని మూటగట్టుకుంటోంది.

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరంలోని ప్రయాణ ప్రాంగణంలో వ్యర్థాలు తొలగించకపోవడం, మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. బస్సు ప్రాంగణం పశువులు, గేదెలు, కుక్కలకు నిలయంగా మారింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపిస్తున్నారు. నగరంలో రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రాంగణం జలమయం అయింది. ప్రయాణికులు చెత్త బుట్టలో వేసిన వ్యర్థాలను తొలగించకపోవడంతో ప్రాంగణాన్ని ఆక్రమిస్తున్నాయి. గేదెలు, వీధి కుక్కలు ప్రాంగణంలోకి రావడంతో అవి ఎక్కడ దాడి చేస్తాయోనని ప్రయాణికులు భయపడే పరిస్థితి నెలకొంది. ప్రాంగణంలో పడిన వర్షపునీరు కోసం ఏర్పాటు చేసిన మురుగు కాలువల్లో వ్యర్థాలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడే ఉన్న మూత్రవిసర్జనశాలలు సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. దోమలు, కందకర్తతో పాటు ప్రయాణికులు ఆరుబయట మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్గంధం భరించలేని పరిస్థితి నెలకొంది.

పది మంది కార్మికులు

నిత్యం ఉదయం, సాయంత్రపు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించి, వ్యర్థాలను తొలగించడం, బస్సు ప్రాంగణం నీటితో శుభ్రం చేయడం, సామూహిక మరుగుదొడ్లు, మూత్రవిసర్జన గదులు శుభ్రం చేయడం, పోగుపడిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి పది మంది సిబ్బందిని నియమించినట్లు రికార్డుల్లో నమోదైంది. ఉదయం ఐదు మంది, సాయంత్రం ఐదు మంది విధులు నిర్వహిస్తారు. సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో బస్సు ప్రాంగణం దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీరు కాలువలో వెళ్లక పోవడంతో బస్సు ప్రాంగణంలో నిలబడిపోయింది. వ్యర్థాలు తొలగించక నిల్వ ఉండటంతో వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాలపై కె.ఎస్.ఆర్.టి.సి వేగ నియంత్రణ అధికారికి 'న్యూస్‌టుడే' పలుమార్లు ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించినా స్పందించలేదు.


ఎంత కాలమైందో వ్యర్థాలు తొలగించి..


బస్సు ప్రాంగణంలో నిలబడిన మురుగునీరు

ఎస్సీ వర్గీకరణ చేయాలని ధర్నా

బళ్లారి, న్యూస్‌టుడే: సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ దళిత రిజర్వేషన్ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సమితి సంచాలకుడు హెచ్.హనుమంతప్ప నేతృత్వంలో సభ్యులు హుసేనప్ప, సోమశేఖర్, ఈశ్వరప్ప, రమేష్, విజయకుమార్, శివశంకర్, ఈరన్న, గురప్ప, సిద్దేశ్, రాజు తదితరులు ఆందోళనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయస్థానం తీర్పు వెల్లడించిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మౌనంగా ఉండిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో వివిధశాఖల్లో ఖాళీగా ఉన్న 26వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. నియామకాలను నిలిపివేసి, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ తర్వాత జనాభాకు అనుగుణంగా బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీసీ కార్యాలయం అధికారికి అందజేశారు.


రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ డీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దళిత వర్గాల ప్రజలు


బళ్లారి: డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న హనుమంతప్ప, సభ్యులు, దళిత సంఘం ప్రముఖులు

దళితులకు రిజర్వేషన్ కల్పించాలని ప్రదర్శన

హొసపేటె, న్యూస్‌టుడే: దళితులకు అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆ వర్గాలవారు బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. జైభీమ్ కూడలి నుంచి జిల్లా పాలనాధికారి కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. ఆందోళనకు నేతృత్వం వహించిన ఎం.సి.వీరస్వామి, కె.పి.ఉమాపతి తదితరులు మాట్లాడుతూ దళితులకు అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని 30 ఏళ్ల నుంచి పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి అంతర్గత రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు.

నిర్మాణ కార్మికుల ఆందోళన

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్ర జనాభాలో ఎక్కువ శాతం ఉన్న తమ సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని నిరసిస్తూ బుధవారం నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సభ్యులు, కార్మికులు కార్మిక శాఖ అధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన యల్లాలింగ తదితరులు మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల పిల్లలకు ఇస్తున్న విద్యా భృతి నిలిపివేత దారుణం. హైకోర్టు ఆదేశాల మేరకు వెంటనే కార్మికుల పిల్లలకు విద్యా భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికశాఖలో పేర్ల నమోదు కోసం సమర్పించిన దరఖాస్తులను ఎలాంటి కారణం ఇవ్వకుండా తిరస్కరించడం విచారకరమని అన్నారు. వెంటనే వారికి గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని కోరారు.


ఆందోళన చేస్తున్న నిర్మాణ కార్మికుల సంఘం సభ్యులు

విభాగ స్థాయి క్రీడల్లో పీడీఐటీ విద్యార్థుల సత్తా

హొసపేటె, న్యూస్‌టుడే: బళ్లారిలో మంగళ, బుధవారాల్లో జరిగిన కలబురగి విభాగం స్థాయి ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాపోటీల్లో హొసపేటె ప్రౌఢదేవరాయ ఇంజినీరింగ్ కళాశాల (పీడీఐటీ) విద్యార్థులు సత్తాచాటారు. మహిళల వాలీబాల్ పోటీల్లో మొత్తం 6 జట్లు పాల్గొనగా, పీడీఐటీకి ద్వితీయ స్థానం దక్కింది. పురుషుల బాస్కెట్‌బాల్ పోటీల్లో 5 జట్లు పాల్గొనగా పీడీఐటీకి ప్రథమస్థానం దక్కింది. విజయపుర ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై హొసపేటె జట్టు ఘన విజయం సాధించింది. ఈ రెండూ జట్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానాచార్య డాక్టర్ యు.ఎం.రోహిత్ తెలిపారు. విజేత క్రీడాకారులను కళాశాల అధ్యక్షుడు బాదామి కరిబసవరాజ, సహాయక ప్రధానాచార్య పార్వతి కడ్లి, వ్యాయామ శిక్షణ సంచాలకుడు కె.ఎస్.మంజునాథ్ అభినందించారు.


వాలీబాల్ పోటీల్లో ద్వితీయస్థానం సంపాదించుకున్న హొసపేటె ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు


బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సంపాదించుకున్న ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు

మెరుగైన సేవలు అందించాలి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే సిటిజన్ కోఆపరేటివ్ బ్యాంకు లక్ష్యమని బ్యాంకు ఛైర్మన్ పి.ఆర్.వి.పి.ఎస్. రాజు పేర్కొన్నారు. బుధవారం అగడి మారెప్ప వీధి సేవాభవన్‌లో ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు రాష్ట్రాల్లో 42 శాఖలతో బ్యాంకు విస్తరించిందని తెలిపారు. సుమారు రూ.4వేలకోట్ల వ్యాపారం సాధించామన్నారు. గత 27 ఏళ్లుగా ఉత్తమ సేవలందిస్తున్నామని చెప్పారు. బళ్లారి శాఖలో 2వేలమంది సభ్యులు ఉన్నారు. రూ.50 కోట్ల లావాదేవీలు జరిగాయన్నారు. ఎండీ సుబ్బయ్య బ్యాంకు సేవలను వివరించారు. బళ్లారి బ్యాంకు మేనేజర్ నరేష్ దుద్దుపూడిని సత్కరించారు. వ్యాపారవేత్త సుబ్బయ్య, రామాంజినేయులు, రాజరావు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిటిజన్ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ పి.ఆర్.వి.పి.ఎస్. రాజు, ఎండీ.కె.వి.సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు

స్వల్ప అవధిలో రూ.505 కోట్ల అభివృద్ధి

సింధనూరు, న్యూస్‌టుడే: మొత్తం గ్యారంటీలకే పెట్టేశారు.. నియోజకవర్గాల్లో అభివృద్ధి ఏదీ..అని తరచూ విమర్శలు గుప్పిస్తున్న ప్రతిపక్షాలకు సింధనూరులో జరుగుతున్న అభివృద్ధి కంటికి కనిపించట్లేదా అని ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ బుధవారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది మీద మూడు నెలలైంది. ఈ వ్యవధిలో సింధనూరు నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.505 కోట్ల నిధులను అభివృద్ధి పనులకు కేటాయించింది. ఇందులో కొన్ని పనులు ప్రారంభం కాగా..కొన్నిటికి శంకుస్థాపన చేయాల్సి ఉందని తెలిపారు. కిందటి ఎమ్మెల్యే నాడగౌడ హయాంలో జరిగినవన్నీ నాశిరకం పనులు, ఏ కోశాన నాణ్యత లేనివి, అన్నీ అరకొర పనులే అని బాదర్లి విమర్శించారు. ఆయన చేపట్టిన పనులే అని నేను వాటిని వదిలేయలేదు. ఆయన పట్టించుకోకుండా వదిలేసినవన్నీ పూర్తి చేస్తున్నానని చెప్పారు. తిమ్మాపూరు ఎత్తిపోతలు, మెటర్నిటీ కేంద్రం, అంబాదేవి దేవస్థానం వీటన్నింటినీ చేపట్టా..తిమ్మాపూరును సీఎంతో ప్రారంభింపచేశా, మెటర్నిటీ తుది మెరుగులు దిద్దుకుంటోంది, అంబామఠం ఆలయ నిర్మాణం మొదలైందని తెలిపారు. నాడగౌడ నాపై చేసే ఆరోపణలు..దురుద్దేశంతో రాజకీయ లబ్ధి కోసమేనని కొట్టిపారేశారు. గొరేబాళ్‌క్యాంపు - వెంకటేశ్వరపైక్యాంపుల మధ్య రూ.20 కోట్లతో చేపట్టిన గ్రామీణ రహదారి నిర్మాణం ఇరువైపులా మీటరు వంతున వెడల్పు చేసి తారు మార్గం నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

105 టీఎంసీలు నింపేయండి..: ప్రస్తుతం 101 టీఎంసీలు మాత్రమే నింపుతున్న తుంగభద్ర జలాశయం బోర్డు అధికారులు..ఇకపై 105 టీఎంసీలను పూర్తిస్థాయిలో నింపేయడం మంచిదని బాదర్లి సలహా ఇచ్చారు. ఇప్పుడేదో తుపాను కారణంగా వానలు కురుస్తున్నాయి..ఇక కురవవు. మిగిలిన నాలుగు టీఎంసీలే వేసవిలో తాగు జలాలుగా ఉపయోగపడొచ్చు..ఇప్పటి నుంచే నింపే కార్యాన్ని మొదలెట్టి మెల్లగా 105 టీఎంసీలకు తీసుకెళ్లమని అధికారులను కోరతానని ఎమ్మెల్యే బాదర్లి వెల్లడించారు.


గ్రామస్థుల మొర ఆలకిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

దాన గుణం అలవర్చుకోవాలి

హుబ్బళ్లి (కారటగి), న్యూస్‌టుడే: సమాజానికి చేసిన దానం వ్యర్థం కాదు. అది ముందు ఉపయోగపడుతుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత అవసరం ఉన్న వారికి దానం చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి అభిప్రాయపడ్డారు. హుబ్బళ్లి స్వర్ణ సమూహ అధిపతి, డాక్టర్ చిగురుపాటి వి.ఎస్.వి.ప్రసాద్ కొప్పళలో ఎంబీబీస్ చదువుతున్న విద్యార్థిని హప్సా భాను హొసూరకు ల్యాప్‌టాప్, హళె హుబ్బళ్లి చెన్నపేట పేపర్ బాయ్ ప్రవీణ్ నటేగల్‌కు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఇచ్చారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి వారిరువురికి బుధవారం వాటిని అందించి మాట్లాడారు. విద్యార్థిని చదువుకు, రోజూ తెల్లవారుజామున వర్షాన్ని, చలిని లెక్క చేయకుండా సైకిల్‌పై ఇంటింటికీ వెళ్లి దిన పత్రికలు అందించే వ్యక్తికి సాయం చేయడం ఇతరులకు ఆదర్శమన్నారు. డాక్టర్ చిగురుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నావంతు సాయం అందించాను. పరోపకార జీవనమే అర్థవంతమన్నారు. విద్యార్థిని హప్సా భాను, ప్రవీణ్ నటేగల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఎంబీబీఎస్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న డాక్టర్ చిగురుపాటి ప్రసాద్


పేపర్ బాయ్‌కి స్కూటర్ తాళం ఇస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి

ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యల పరిశీలన


కారటగి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పురసభ అధ్యక్షురాలు, ముఖ్యాధికారి తదితరులు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పురసభ అధ్యక్షురాలు ఎ.రేఖ, ముఖ్యాధికారి సురేశ్ ఇతర సభ్యులు బుధవారం స్థానిక ప్రభుత్వ సముదాయ ఆసుపత్రికి వెళ్లి సమస్యలను పరిశీలించారు. అనంతరం అధ్యక్షురాలు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు, రోగుల ఫిర్యాదు మేరకు ఆరోగ్య రక్షా సమితి, పురసభ సభ్యులు, అధికారులతో కలిసి ఆసుపత్రిని పరిశీలించేందుకు వచ్చాం. పిల్లల వైద్యుడు రెండు నెలలుగా ఆసుపత్రికి సక్రమంగా రావడం లేదని తెలిసింది. ఎక్స్‌రే, రక్త పరీక్ష విభాగాల్లో టెక్నీషియన్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆసుపత్రి వైద్యాధికారిణికి సూచించామన్నారు. ముఖ్యాధికారి సురేశ్ మాట్లాడుతూ చుట్టూ ఉన్న నివాసాల వారు చెత్తను ఆసుపత్రి ఆవరణలో వేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమమై వారికి నోటీసు జారీ చేస్తాం. అయినా వారు అదే చర్యకు పాల్పడితే జరిమానా విధిస్తామన్నారు. వైద్యాధికారిణి శకుంతలా పాటిల్, ఆరోగ్య రక్షా సమితి సభ్యులు ఎం.హనుమేశ్, తుళజారామ్, పురసభ ఉపాధ్యక్షురాలు దేవమ్మ, సభ్యులు ఈశప్ప ఇట్టంగి, బసవరాజ కొప్పద, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నడకమార్గాలపై ఆక్రమణల తొలగింపు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికెలో ఫుట్‌పాత్‌లపై వెలిసిన అక్రమ కట్టడాలు, డబ్బా దుకాణాలు, టీ స్టాల్ తదితర వాటిని తొలగించారు. పాలికెలో రహదారులకు ఇరువైపులా వేసిన ఫుట్‌పాత్‌లను అక్రమంగా ఆక్రమించుకోవడంతో పాదచారులు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. రహదారి మధ్య వెళ్లడం వల్ల నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. మేయర్ ముల్లంగి నందీష్, కమిషనర్ ఖలీల్‌సాబ్ ఆదేశాలతో మొదట తన 18వ వార్డు నుంచి ఫుట్‌పాత్‌లపై అక్రమంగా వెలిసిన వాటిని పాలికె సిబ్బంది తొలగించారు. నేటి నుంచి నగర పాలికెలో ప్రధాన రహదారులు, కూడళ్లలో ఫుట్‌పాత్‌లపై వెలసిన వాటిని తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



రిబ్బను కత్తిరిస్తున్న హోకుగో క్యూకో.. చిత్రంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు



సత్కారం అందుకున్న జపాన్ దేశ ప్రతినిధులు హోకుగో క్యూకో, టేకుచి టకురో, ట్సుటోము నకానె

రాజధాని శివార్లకూ శుద్ధజలం

మండ్య, న్యూస్‌టుడే : బెంగళూరులో తాగునీటి సమస్యల పరిష్కారానికి కావేరి ఐదవ స్టేజ్ ద్వారా నీటిని అందిస్తున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ఉద్యాననగరిలో 110 గ్రామాలు చేరిన అనంతరం, నగరం నాలుగు చెరగులా విస్తరించాకే కావేరి నీటికి కొరత ఎదురైందన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన కావేరి ఐదవ దశ పనులను, మళ్లీ తన హయాంలోనే పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. మళవళ్లి తాలూకా తొరకాడనహళ్లిలోని జల మండలి ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి మీట నొక్కి బుధవారం ప్రారంభించారు. దేశంలో మూడో అతి పెద్ద నగరం.. బెంగళూరులో నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బెంగళూరులో 1896 వరకు ధర్మాంబుధి, సంపంగి, హలసూరు, స్యాంకి చెరువుల నుంచి తాగునీరు సరఫరా చేసేవారని గుర్తు చేశారు. నగర జనాభా పెరగడంతో 1974 నుంచి కావేరి నుంచి నీటిని నగరానికి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. తదుపరి సంవత్సరాల్లో మరో మూడు దశల్లో జలమండలి నీటిని నగరానికి తీసుకువచ్చిందన్నారు. మహానగర పాలికెలోకి 110 గ్రామాలు చేరడం, జనాభా 1.4 కోట్లను దాటడంతో కొత్తగా కుళాయి కనెక్షన్లను ఇచ్చేందుకు, నిత్యం 2,200 ఎంఎల్‌డీ నీటిని సరఫా చేసేందుకు ఈ పథకాన్ని పూర్తి చేశామని వివరించారు. ఐదో దశ పథకంతో నగరానికి కొత్తగా 775 ఎంఎల్‌డీ నీరు లభిస్తుందన్నారు.



గొట్టాలద్వారా తరలించి.. నీటిని శుద్ధి చేసే ఘట్టం



హారోహళ్లి సమీపంలో నిర్మించిన ఎత్తిపోత కేంద్రం

పథకాన్ని పూర్తి చేసేందుకు రూ.4,333 కోట్లు అవుతాయన్న అంచనా వేయగా, జపాన్ కోఆపరేషన్ ఏజెన్సీ సహకారంతో 2018లో పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. మేకెదాటు ప్రాజెక్టు పూర్తి చేస్తే నగరంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ పథకానికి అనుమతులు ఇప్పించే అవకాశం ఉన్నా.. మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. కావేరి ఆరో దశ పనులను చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించానని చెప్పారు. ఇచ్చిన హామీని నెరవేర్చే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ప్రతి ఏటా రూ.4 లక్షల కోట్లను పన్నుగా చెల్లిస్తున్నా, కేంద్రం నుంచి వస్తున్న నిధులు నామమాత్రంగానే ఉన్నాయని తెలిపారు. కర్ణాటక 100 పైసలు ఇస్తే, కేంద్రం 15 పైసలు మాత్రమే విడుదల చేస్తుందని సభికులకు వివరించారు. ఈ అన్యాయంపై భాజపా నాయకులు నోరు మెదపడం లేదని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు కేజే జార్జ్, చెలువరాయస్వామి, ఎమ్మెల్యేలు భైరతి బసవరాజు, ఎస్‌టీ సోమశేఖర్, ఎస్ఆర్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ టీఎం నాగరాజు, నరేంద్రస్వామి, రవి, దినేశ్ గూళిగౌడ తదితరులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సహకారం అందించిన జపాన్ దేశ ప్రతినిధులు, ఉన్నతాధికారులు హోకుగో క్యూకో, టేకుచి టకురో, ట్సుటోము నకానెలను ఇదే సందర్భంగా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఘనంగా సత్కరించారు.

పండ్ల చెట్లపైకే రాళ్లు..

మండ్య, న్యూస్‌టుడే : విమర్శలు, తప్పుడు ఆరోపణలు చేసే వారి మాటల్ని వినిపించుకోనని కేంద్ర మంత్రి కుమారస్వామిని ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అటువంటి వ్యక్తులను పట్టించుకోనంటూ 'ఐ డోంట్ కేర్' అని ఆగ్రహం ప్రదర్శించారు. మళవళ్లి తాలూకా తొరెకాడనహళ్లిలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. విమర్శలు నాశనం అవుతాయని, చేసిన పనులే శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. ఎత్తినహొళె ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఆ నీటిని తిప్పగొండనహళ్లి జలాశయానికి పంపడం ద్వారా బెంగళూరుకు కావలసిన అదనపు నీటిని అందిస్తామని ప్రకటించారు. పండ్లతో నిండి ఉన్న చెట్టుపైకి పలువురు రాళ్లు వేస్తుంటారని, తాను అటువంటి వారిని పట్టించుకోనని అన్నారు. తుంగభద్ర ఆనకట్ట 19వ క్రస్ట్ గేట్ పాడయినా, దానికి తననే దూషించారని గుర్తు చేశారు. మరమ్మతుల అనంతరం భారీ వర్షాలు కురవడంతో ఆనకట్టలోకి నీరు మళ్లీ చేరిందని సంతోషం వ్యక్తం చేశారు. మళవళ్లిలో అంబేడ్కర్ భవంతి నిర్మాణానికి ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో రూ.5 కోట్లు విడుదల చేయిస్తానని చెప్పారు.

ఆకాశానికి గండి..

రాజధానిలో అలజడి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలుప్రాంతాలు ముంపుపాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వానలు.. బుధవారం సాయంత్రం వరకూ ఆగనేలేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం నగరంపై తీవ్రంగా పడింది. రోజుకు ఐదు మిల్లీమీటర్ల వర్షపాతం స్థానే.. 20 మిల్లీమీటర్ల వాన కురిసిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగనుంది. గురువారం తుపాన్ తీరం దాటే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ రాష్ట్ర సంచాలకుడు ఎస్.బి.పాటిల్ వెల్లడించారు. వర్షం కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఇంటినుంచి విధులు నిర్వహించాలని ఐటీ, బీటీ ఉద్యోగులకు ఆయా సంస్థలు సూచించాయి. వర్షంలో తడుస్తూ అనేక మంది ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. అత్యధికులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించడం ప్రస్తావనార్హం.



మహదేవపురలో విరిగిపడిన చెట్టు

- యలహంక కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్లో మూడు అడుగుల స్థాయి వరకు వాననీరు నిలిచిపోయింది. అక్కడ ప్రజలను సమీపంలో ఉన్న ప్రైవేట్ వసతి గృహాలకు తరలించారు. రెండు రోజుల నుంచి అపార్ట్‌మెంట్ చుట్టూ నీరు నిలిచిపోయి ఇబ్బంది పెడుతోంది. ఆ ప్రాంతాన్ని పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ పరిశీలించి సహాయక చర్యలకు ఆదేశించారు. నిరుడు ముంపునకు గురైన కె.ఆర్.పురం ప్రాంతంలోని సాయి లేఔట్ ఇంకోసారి నిండా మునిగింది. అక్కడ 150 కుటుంబాల వారు వాననీటిలోనే కాలం గడుపుతున్నారు. యంత్రాల సాయంతో నీటిని బయటకు తోడేస్తున్నారు. యలహంక రమణశ్రీ లేఔట్‌లో నీరు నిలిచిపోయి, ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇందిరానగర 17వ డి-క్రాస్ ప్రదేశం ద్వీపంలా మారింది. పుష్కర కాలం నుంచి అక్కడ వానాకాలం ఇదే ఇబ్బందే. బళగెరె రహదారి వాగులా మారింది. సర్జాపుర రహదారి మునిగిపోయింది. మాన్యతా టెక్ పార్కు ముంగిట ఓ నిర్మాణం కోసం తవ్విన ప్రదేశంలో భూమి విరిగిపడింది. ప్రహరీ కూలిపోయింది. అక్కడ సంచార రద్దీ నెలకొంది. గంటల తరబడి వాహనాలు స్తంభించాయి. చిక్కబాణవార, ద్వారకనగర, గణపతినగర, మారుతినగర వాసులకు కడగండ్లే మిగిలాయి. రింగ్‌రోడ్డు, హెబ్బాళ్ కూడలి, హోసూరు మార్గ్, తుమకూరు రోడ్డుపై వాహనాలు కదల్లేని దుస్థితి ఎదురైంది. వర్షం కురిసే సమయంలో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



బళగెరె రహదారి ముంపుపాలు.. రాకపోకలకు ఆటంకాలు



మైసూరు మార్గంలో వృషభావతి కాలువ జోరు




మునిగిన సాయి లేఔట్ ప్రాంతమిదీ



నీట మునిగిన యలహంక కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్



పణంతూరు రైల్వేవంతెన వద్ద నీటితో కష్టాలు



పాత మైసూరు బ్యాంకు కూడలి వద్ద వాహన రద్దీ

దర్శన్‌తోనే నాకీ కష్టాలు

- చెన్నబసప్ప ఆగ్రహం

గదగ, న్యూస్‌టుడే : తాను వినికిడి సమస్యలను ఎదుర్కొనేందుకు నటుడు దర్శన్ కారణమని సీనియరు సాహితీవేత్త గో.రు. చెన్నబసప్ప పేర్కొన్నారు. గదగలో సిద్ధలింగ స్వామి వర్ధంతిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బెంగళూరులో దర్శన్ ఇంటి పక్కనే తాను ఉంటున్నానని గుర్తు చేశారు. దర్శన్ సినిమా విడుదలైనప్పుడు, పుట్టిన రోజు సందర్భంలో అభిమానులు కాల్చే బాణసంచాతో తాను వినికిడి సమస్యలను ఎదుర్కొంటున్నానని చెప్పారు.

వారికీ.. బెయిల్ నిరాకరణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో కారాగారం చేరిన ముగ్గురు నిందితులు వేసుకున్న బెయిలు అర్జీని 57వ సీసీహెచ్ కోర్టు న్యాయమూర్తి జైశంకర్ తోసిపుచ్చారు. హత్య కేసులో ఏ3 పవన్, ఏ10 వినయ్, ఏ14 ప్రదోశ్‌లు బెయిలు కోరుతూ అర్జీ వేసుకున్నారు. వారికి బెయిలు ఇవ్వవద్దని ప్రభుత్వ ప్రత్యేక న్యాయమూర్తి ప్రసన్నకుమార్ వాదనలు వినిపించారు. ఇప్పటికే బెయిలును తిరస్కరించడంతో ఈ కేసులో ఏ1గా ఉన్న నటి పవిత్రాగౌడ ఉన్నత న్యాయస్థానంలో బెయిలు కోసం బుధవారం అర్జీ వేసుకున్నారు.

వక్ఫ్ చట్టాల రద్దు కోరుతూ ధర్నా

విజయపుర, న్యూస్‌టుడే : వక్ఫ్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ నేతృత్వంలో విజయపురలో భాజపా, ఇతర అనుబంధ సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. ఎమ్మెల్సీ సీటీ రవి, లోక్‌సభ సభ్యుడు రమేశ్ జిగజిణగి, నమో బ్రిగేడ్ వ్యవస్థాపకుడు చక్రవర్తి సూలిబెలె తదితరుల నేతృత్వంలో కార్యకర్తలు శ్రీ సిద్ధేశ్వర దేవాలయం వద్ద ఆందోళనకు దిగారు.

మహిళా సమానతకు భంగం

రామనగర, న్యూస్‌టుడే : బిగ్‌బాస్ కన్నడ రియాల్టీ షో నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి వచ్చామని రామనగర ఎస్పీ కార్తిక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమానత్వానికి భంగం కలిగేలా నిర్వాహకులు వ్యవహరించారని వచ్చిన ఫిర్యాదులు, మహిళా కమిషన్ ఇచ్చిన సూచనలతో కుంబళగోడులోని 'బిగ్ బాస్' సెట్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ హూగార్ స్వర్గ నోటీసులు ఇచ్చి వచ్చారని ఎస్పీ వివరించారు.

దుర్యోధనుడే గెలుస్తాడట!

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : 'రాష్ట్ర రాజకీయాల్లో దుర్యోధనుడు గెలుస్తాడు' అని కోడి మఠం శివానంద శివయోగి రాజేంద్రస్వామి భవిష్యత్తు చెప్పడం చర్చకు తావిచ్చింది. 'ముఖ్యమంత్రిని ఇబ్బంది పెడుతున్నారు. ఆయన భార్యను బరిలోకి తీసుకువచ్చారు. ఈ మహాభారతంలో రాజు గెలుస్తాడు. దైవబలం లేదు. ఇంకా కొద్ది రోజుల్లో రాజకీయాల్లో మార్పులు వస్తాయి. దుర్యోధనుడే గెలుస్తాడు' అని ఆయన తన భవిష్యవాణిని వినిపించారు.

దావణగెరె బంద్ సంపూర్ణం

దావణగెరె, న్యూస్‌టుడే : కర్ణాటకలోని మొదటి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల 'యూబీడీటీ'లో 50 శాతం సీట్లను పేమెంట్ కోటాకు తీసుకురావడాన్ని ఖండిస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాలు దావణగెరెలో బుధవారం బంద్ ఆచరించాయి. ధర్నాకు కన్నడ, వ్యాపారుల, నివాసుల, హోటళ్ల, ప్రైవేటు ట్రావెల్స్, ఆటో, క్యాబ్ సంఘాలు మద్దతు ఇచ్చాయి. మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు నామమాత్రంగానే కనిపించాయి. ప్రభుత్వమే మేనేజ్‌మెంట్ కోటాను తీసుకువచ్చి యూబీటీడీ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆందోళనకు నేతృత్వం వహించిన విద్యార్థి నేత అజయ్ కామత్ ధ్వజమెత్తారు. ఫీజుల పెంపు, సగం సీట్లను విక్రయించుకోవడం ద్వారా పేద విద్యార్థులకు అన్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. జిల్లాధికారి కార్యాలయం వైపు వెళుతున్న ఆందోళనకారుల్లో 30 మందిని పోలీసులు బంధించి, ఠాణాకు తీసుకువెళ్లారు. వ్యక్తిగత పూచీకత్తుపై సాయంత్రం వారిని విడుదల చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని తీవ్రం చేస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు.



ఆందోళనలో కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాల ప్రతినిధులు

గాడిద పాల కేసులో మరో ఇద్దరి అరెస్టు



హర్షవర్ధన్‌రాజు



గుర్రం యోగానంద రెడ్డి

హొసపేటె, న్యూస్‌టుడే: జెన్నీ మిల్క్ కంపెనీ పేరిట గాడిద, వాటి పాలు విక్రయించి, రైతులను వంచించిన కేసులో మరో ఇద్దరు ఆంధ్రా వాసులను బుధవారం కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా హొసపేటె పోలీసులు అరెస్టు చేశారు. వీరిని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమనగర్ చెందిన ఎన్.హర్షవర్ధన్‌రాజు, అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన గుర్రం యోగానందరెడ్డిగా గుర్తించారు. వీరి నుంచి రూ.10లక్షలు విలువైన కారును స్వాధీనం చేసుకున్నారు. రైతుల నుంచి వసూలు చేసి, వీరి బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.36లక్షలను జప్తు చేశారు. జెన్నీ మిల్క్ గాడిద, పాలు విక్రయం కంపెనీలో వీరిద్దరూ ఉద్యోగులని చెప్పి రైతులను వంచించారని విలేకరుల సమావేశంలో విజయనగర ఎస్పీ శ్రీహరి బాబు తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేసులో మొత్తం ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

నేనే అభ్యర్థిని: యోగీశ్వర్

రామనగర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో నేనే అభ్యర్థినని మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ పునరుద్ఘాటించారు. ఎన్‌డీఏ అభ్యర్థిగా తననే ప్రకటిస్తారని, ఎవరికీ అనుమానం వద్దన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన బుధవారం ఇక్కడ ప్రసంగించారు. ఈసారి తప్పనిసరిగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కూడ్లూరు రోడ్డులోని ఒక రిసార్టులో స్థానిక కార్యకర్తలు, ప్రజల కోసం మాంసాహార భోజనాన్ని యోగేశ్వర్ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకుని అక్కడకు పోలీసులతో కలిసి వచ్చిన ఎన్నికల అధికారులు బిర్యానీ, వంట పాత్రను స్వాధీనం చేసుకుని వెళ్లారు. భోజనం తిందామని వచ్చిన వారంతా నిరాశతో వెనుదిరిగారు.

సిద్ధుపై రేవణ్ణ రుసరుస

హాసన, న్యూస్‌టుడే : త్వరలోనే కొందరు రాజకీయ నాయకులు లైన్లో నిలిచే కాలం వస్తుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఉద్దేశించి మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. హొళెనరసీపుర తాలూకా బిదరక్కకొళల గోపాలకృష్ణ ఆలయానికి తన సోదరుడు కుమారస్వామి, ఇతర కుటుంబ సభ్యులతో మంగళవారం సాయంత్రం వెళ్లి పూజలు చేసుకున్నారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో రేవణ్ణ మాట్లాడుతూ.. ఒక పోలీసు అధికారిని అడ్డుపెట్టుకుని నన్ను బెదిరించారని ఆరోపించారు. రాజకీయంగా అంతం చేసేందుకు వేధించిన వారంతా ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు.

ఉద్యాననగరిలో విహారానికి 'ఎయిర్ ట్యాక్సీ'

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఉద్యాననగరి ఇప్పుడు ట్రాఫిక్ నగరంగా మారిపోయింది. బెంగళూరుకు వచ్చిన వారందరూ వాహన రద్దీతో ఇబ్బంది పడిన వారే. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎలక్ట్రానిక్ సిటీ వరకు ఎయిర్ ట్యాక్సీని నడిపేందుకు విమానయాన శాఖ ముందుకు వచ్చింది. 'ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్' కోసం ఏడు సీట్ల విమానాలను అభివృద్ధి చేస్తున్నామని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు తమ ఎక్స్ కార్పులో పోస్టు చేశారు. ప్రస్తుతం ప్రీమియం ట్యాక్సీలో ఎలక్ట్రానిక్ సిటీ నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు 152 నిమిషాల సమయం, రూ.2500 నగదు చెల్లించవలసి వస్తోంది. తమ ఏడు సీట్ల ఎయిర్ ట్యాక్సీ అందుబాటులోకి వస్తే 19 నిమిషాల్లోనే రెండు ప్రాంతాల మధ్య ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో ప్రయాణించేందుకు ఒక్కో ప్రయాణికుడు రూ.1700 చెల్లిస్తే సరిపోతుందని వివరించింది. గతంలోనే ఎయిర్ ట్యాక్సీ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ దాన్ని వినియోగించుకునే వారు లేకపోవడంతో నిలిచి పోవడం ప్రస్తావనార్హం.

నందిని విక్రయాల్లో ఇక దోసె పిండి!

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పాలు, పెరుగు, నెయ్యి, మిఠాయిలు, ఐస్‌క్రీమ్ విక్రయ విభాగాల్లో చక్కని గుర్తింపు దక్కించుకున్న ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'నందిని' బ్రాండ్ ఇప్పుడు దోసె పిండిని విక్రయించేందుకు సిద్ధమైంది. కర్ణాటక పాల సమాఖ్య ప్రారంభంలో ఒక కిలో, రెండు కిలోల ప్యాకెట్లను విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. పిండి తయారీకి కావలసిన మినపపప్పు, బియ్యం, అటుకులు, మెంతులు, శెనగపప్పు ధాన్యం గింజలను సరఫరా చేసే వారి నుంచి ఇప్పటికే టెండరు ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం.

దసరా వేడుకల్లో రూ.500 కోట్ల వ్యాపారం

మైసూరు, న్యూస్‌టుడే : దసరా పండగకు మైసూరులో చక్కని వ్యాపారం కొనసాగినట్లు వ్యాపారుల సంఘం ప్రకటించింది. పర్యాటక శాఖతో కలిసి వ్యాపారాలు నిర్వహించిన హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర దుకాణ సముదాయాల్లో పది రోజుల్లో రూ.500 కోట్ల వ్యాపారం నమోదైనట్లు అంచనా వేశారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని అక్టోబరు 3 నుంచి 13 మధ్యలో 16 లక్షల మంది పర్యాటకులు వచ్చి వెళ్లారని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

చిరుత సంచారంతో భయాందోళన

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: మొళకాల్మూరు తాలూకా రాంపురం బొమ్మలింగనహళ్లి రహదారిలో చిరుత సంచరించడాన్ని కూలీ కార్మికులు చూసినట్లు గ్రామ పంచాయతీ సభ్యుడు తిప్పేశ్ తెలిపారు. బుధవారం ఆయన అటవీ శాఖ అధికారులకు అందించిన సమాచారం మేరకు.. రెండు రోజుల క్రితం చిరుత రహదారిని దాటి పోవడాన్ని చూసిన కార్మికులు చరవాణిలో వీడియో తీశారు. పశువులను మేపుకొని రావడానికి, వ్యవసాయ పనుల కోసం గ్రామ ప్రజలు పొలాలకు వెళ్లడానికి భయపడుతున్నట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే చిరుతలను పట్టుకోవడానికి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కావేరి.. సిరిగన్నడ దేవేరి!

- నేడే తీర్థోద్భవ వేడుకలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : దక్షిణ భారత జలదేవేరిగా వినుతికెక్కిన కావేరి మాత తీర్థోద్భవానికి వేళయ్యింది! కొడుగు జిల్లా తలకావేరిలో పవిత్రోత్సవాలు గురువారం ఉదయం 7.30కి ప్రారంభిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్న క్రమంలో అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. భక్తుల స్నానాదులకు ఎలాంటి ఆటంకాలూ లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. భాగమండల శ్రీభగండేశ్వర దేవాలయ సభాంగణంలో ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారమే ఉత్సవ ఏర్పాట్లకు ముందడుగు వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అధికారులు జాగ్రత్త వహించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బోసురాజు సూచించారు. బుధవారం ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. ఓ వైపు వానలు కొనసాగుతున్నా కదలివస్తున్న వారితో భాగమండల కిటకిటలాడుతోన్న క్రమంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. కొడగుతో పాటు మైసూరు, దక్షిణ కన్నడ, హాసన జిల్లాల నుంచి రవాణా వ్యవస్థను మెరుగుపరిచారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశాయి. ఉదయమే వేడుకలు ప్రారంభమవుతాయన్న సమాచారంతో బుధవారం రాత్రికంతా ఎక్కువ మంది శ్రీతీర్థ క్షేత్రానికి తరలివస్తున్నారు. పోలీస్ అధికారి కె.రిమరిజన్ నేతృత్వంలో భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

- దేశంలోని జీవనదుల్లో స్వచ్ఛతకు పేరెన్నికగన్నది కావేరీ! కొడగు జిల్లా బ్రహ్మగిరి పర్వత ప్రాంతాల్లోని తలకావేరిలోని చిన్న కుండికలో నది ఉద్భవిస్తుంది. ఆ ప్రాంతంలో ఓ నందీశ్వరుడి విగ్రహాన్ని అమర్చారు. గంగమ్మ ఆ విగ్రహం నుంచి ఉబికి వస్తున్నట్లు భక్తులు విశ్వసిస్తారు. ఆ జలం కొండ ప్రాంతం నుంచి ఎలా కదలివస్తున్నదీ నేటికీ అంతుచిక్కని అంశమే. ఎడతెగకుండా నీరు ఊరుతోంది. ఇక్కడ నీటి స్వచ్ఛత నిపుణులనే ఆశ్చర్యపరుస్తుంది. ఆ నీటిని సేవించడం ఆరోగ్యకరంగా భక్తులు భావిస్తారు. పుణ్యస్నానాలకూ జలాన్ని తీసుకెళతారు. కావేరి మాతను తమ ఆడపడుచుగా కన్నడిగులు ఘనమైన స్థానాన్ని కల్పించారు. తలకావేరి నుంచి పూర్వాభిముఖంగా పయనించి మైసూరు, మండ్య, చామరాజనగర జిల్లాలను దాటి.. తమిళనాడు మీదుగా 802 కిలోమీటర్లు సాగి బంగాళఖాతంలో సంగమిస్తుంది. కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలూ ఈ నదీమతల్లి పరివాహక ప్రాంతంలో భాగమే. కబిని, హారంగి, శింషా, హేమావతి, లక్ష్మణ తీర్థ, లోకపావని తదితరాలు.. కావేరీ ఉపనదులుగా విరాజిల్లుతోన్నాయి. రైతుల పంటలు పండించడంతో పాటు.. కోట్ల మంది గొంతులు తడుపుతూ ఈ గంగమ్మ పునీతమవుతోంది!



నంది విగ్రహం నుంచి దూకుతున్న గంగమ్మ



కావేరి మాత మహా ఆలయ ప్రాంగణం



కావేరినది ఉద్భవ ప్రాంతం.. తలకావేరి

మాదకద్రవ్య విక్రేత అరెస్టు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న కుమార్ అనే యువకుడిని సంపంగిరామనగర ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఎనిమిది గ్రాముల ఎండీఎంఏ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సర్జాపుర రోడ్డు నల్లూరు కూడలిలో వాటిని కొనుగోలు చేసుకుని, నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడని ప్రాథమిక విచారణలో నిందితుడు తెలిపారు.

గంధం చెట్టు నరికివేత

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : యలహంక జ్యుడిషియల్ లేఅవుట్‌లోని పాలికె ఉద్యానవనంలో ఏపుగా పెరిగిన గంధం చెట్టును దుండగులు మంగళవారం రాత్రి నరుక్కుని వెళ్లారు. చెట్టును నరుక్కుని వెళ్లినట్లు బుధవారం ఉదయం అక్కడికి నడకకు వచ్చిన వారు గమనించి యలహంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో చెట్టును నరికి గంధం చెక్కలను తరలించినట్లు పోలీసులు గుర్తించారు.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

భారత క్రికెటర్లను కలిసిన పరిక్రమ బాలలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : పరిక్రమ ఫౌండేషన్‌కు చెందిన ఐదు మంది బాలలు భారత క్రికెట్ ఆటగాళ్లను వీక్షించే అవకాశం దక్కింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బీసీసీఐ సంస్థలతో కలిసి మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ బాలలు అరుదైన అవకాశాన్ని పొందారు. చిన్నస్వామి మైదానంలో పరిక్రమ బాలలు క్రికెటర్లతో నెట్‌లో అభ్యాసం చేసే అవకాశం దక్కించుకొన్నారు. క్రికెటర్లు సంజుశ్యాంసన్, బౌలర్ హర్షదీప్‌సింగ్, సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి బ్యాటింగ్ చేసే అవకాశాన్ని పొందారు.



హర్షదీప్‌సింగ్, సంజుశ్యాంసన్, సూర్యకుమార్‌లతో బాలలు

ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలి

బెంగళూరు (యశ్వంతపుర): ఎస్సీ వర్గాల రిజర్వేషన్లు ఏబీసీడీలుగా వర్గీకరించాలని కర్ణాటక మాదిగ దండోరా జనజాగృతి సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం ఇక్కడ స్వతంత్ర ఉద్యానవనంలో రిజర్వేషన్లు వర్గీకరణ కోసం ఆందోళన నిర్వహించిన సమితి అధ్యక్షుడు ఎంసీ శ్రీనివాస్ నేతృత్వంలోని పదాధికారులు బెంగళూరు నగర జిల్లాధికారి జగదీశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జస్టిస్ సదాశివ కమిషన్ నివేదికను ప్రభుత్వం అంగీకరించి, సర్వోన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని సమితి అధ్యక్షుడు ఎంసీ శ్రీనివాస్ తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వచ్చిన తరువాత కర్ణాటకలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారని గుర్తు చేశారు. తక్షణం ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించే ప్రక్రియ ప్రారంభించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సమితి గౌరవాధ్యక్షుడు కేబీ నరసింహ, ప్రధాన కార్యదర్శి దాస్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు కబుర్లు



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మంజునాథ్

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

హోసూరు, న్యూస్‌టుడే : ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దృఢసంకల్పంతో ముందుకు సాగాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీ డాక్టర్ మంజునాథ్ వైద్య విద్యార్థులకు సూచించారు. హోసూరు సమీపం ఎడవనహళ్లిలోని ఆక్స్‌ఫర్డ్ వైద్య కళాశాల, ఆసుపత్రి ఆడిటోరియంలో బుధవారం ఎం.బి.బి.ఎస్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ రోగులను చిరునవ్వుతో పలుకరించాలని, ముఖ్యంగా గ్రామీణ పేద ప్రజలకు వైద్య సేవలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేశంలో వైద్య రంగం ఎంతో పురోభివృద్ధి చెందిందని, విదేశాల నుంచి వైద్యులు ఇక్కడికి వస్తున్నందున పోటీ తీవ్రమైందన్నారు. వైద్య కళాశాల వ్యవస్థాపకుడు నరసరాజు మార్గదర్శకంలో ఆతని కుమారుడు డాక్టర్ ఎస్.ఎన్.వి.ఎల్.నరసింహరాజు అంతర్జాతీయ స్థాయిలో ఆసుపత్రి, కళాశాల, పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నాణ్యమైన సేవలు అందిస్తున్నారని, ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు డాక్టర్ మంజునాథ్, ముఖ్య అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో బెంగళూరు మెడికల్ కళాశాల డీన్, డైరెక్టర్ డాక్టర్ సి.ఆర్.జయంతి, బ్రైన్స్‌సైర్ ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.కె.వెంకటరమణ, ఆక్స్‌ఫర్డ్ కళాశాల డైరెక్టర్ వై.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ రజని, పర్యవేక్షకుడు డాక్టర్ వి.బి.గౌడ, క్లినికల్ సమన్వయకర్త డాక్టర్ సుమ తదితరులు పాల్గొన్నారు.



మంజునాథ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆసుపత్రి పనులను పరిశీలించిన ఉన్నతాధికారి



ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు, ఉన్నతాధికారి శిల్పా ప్రభాకర్

హోసూరు: హోసూరు రాయకోట జాతీయ రహదారి అచ్చెట్టిపల్లి గ్రామ పంచాయతీ నాలుకకొండ అగ్రహారంలో రూ.100 కోట్లతో నిర్మించనున్న జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి భవననిర్మాణం పనులను బుధవారం కలెక్టర్ సరయు, ఉన్నతాధికారి షిల్పా ప్రభాకర్ పరిశీలించారు. పనుల నాణ్యతను సంబంధిత అధికారులతో చర్చించారు. ఆసుపత్రిలో వివిధ చికిత్సలకు ఏర్పాటుచేయనున్న వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, సబ్‌కలెక్టర్ ప్రియాంక, జాయింట్ డైరెక్టర్ దరుమర్, జిల్లా ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌కుమార్, అచ్చెట్టిపల్లి పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విభాగం ముఖ్యుడిగా సతీష్‌గౌడ, ప్రిన్సిపల్‌గా దశరథ్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : బెంగళూరు విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సంయోజనాధికారిగా ఉన్న ఆచార్య సతీష్‌గౌడ న్యాయ కళాశాల అధ్యయన విభాగం ముఖ్యుడిగా నియమితులయ్యారు. డీన్, అధ్యక్షుడిగా పని చేస్తున్న ఆచార్య ఎన్.దశరథ్‌ను న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించారు. ఈమేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బుధవారం ప్రకటించారు.



సతీష్‌గౌడ



దశరథ్

లోతట్టు ప్రాంతాలు జలమయం



శెట్టిహళ్లి రహదారిలో వాగులా వర్షం నీరు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు. దాసరహళ్లి నియోజకవర్గంలోని శెట్టిహళ్లి, చిక్కబాణవార, సోమశెట్టిహళ్లి, బాగలగుంట, సౌందర్య బడావణే, ముత్యాల నగర, భాతగార, సిద్ధార్థనగర్, అంబేడ్కర్ కాలనీ, కళానగర, లక్ష్మీపుర తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు మురికివాడ ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలు సమీపంలోని పాఠశాలల్లో తలదాచుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు వ్యాపారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీబీఎంపీ సిబ్బంది పలు ప్రాంతాల్లో వర్షం నీటిని చెరువులకు మళ్లించారు. కొన్ని చోట్ల విద్యుత్తు సరఫరా లేక చీకట్లోనే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

వర్షానికి కూలిన పురాతన ఇల్లు



పడిపోయిన ఇంటిలో వృద్ధురాలు లక్ష్మమ్మ

పావగడ : తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా నిరంతరంగా కురుస్తున్న వర్షానికి తాలూకాలోని చిక్కహళ్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలి ఇల్లు కూలిపోయింది. కూలీ పనులు చేస్తూ తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటున్న లక్ష్మమ్మ శిథిలావస్థలో ఉన్న పురాతన ఇల్లు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. ఇద్దరు కుమారులతో నివసించడానికి ఆమె ఇబ్బంది పడుతోంది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామ లెక్కాధికారి రమువీర్, అంజనీకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాన్ని అందజేస్తామని లక్ష్మమ్మకు హామీ ఇచ్చారు.

తొలి రోజు ఆటకు అంతరాయం

బెంగళూరు (క్రీడలు) : ఇక్కడ చిన్నస్వామి స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య బుధవారం జరగాల్సిన టెస్ట్ మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కల్పించడంతో అభిమానులు నిరాశ చెందారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా మైదానం మొత్తం వాననీటితో తడిసిపోయింది. వర్షంలోనే పోటీ వీక్షించేందుకు అభిమానులు వచ్చారు. కనీసం టాస్ ప్రక్రియ కూడా జరగలేదు. పిచ్‌పై వేసిన ప్లాస్టిక్ కప్పును కూడా తీయలేదు. వర్షం కారణంగా అంపైర్లు ఆటను రద్దు చేశారు.



స్టేడియంలో పిచ్‌ను కవర్ చేస్తున్న సిబ్బంది



సహాయవాణి కేంద్రంలో డీకే శివకుమార్, అధికారులు

పాలికె సహాయవాణి కేంద్రంలో డీసీఎం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కురుస్తున్న వర్షాలకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాలికె కేంద్ర కార్యాలయంలో ఉన్న సహాయవాణి కేంద్రాన్ని సందర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు చేసిన ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదుల పరిష్కార జాబితాపై అధికారులను వాకబు చేశారు. గంట సేపు అక్కడే ఉన్న ఆయన కొన్ని ఫోన్‌కాల్స్ స్వీకరించి సమాధానం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మామూలుగా కన్నా ఎక్కువ వర్షం కురిసిందన్నారు. యలహంక పడమటి విభాగం, తూర్పు విభాగం, మహదేవపుర, దాసరహళ్లి, బెంగళూరు దక్షిణ ప్రాంతాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. 142 ఇళ్లలోకి వాననీరు ప్రవహించిందని, 30 చెట్లు నేలకొరిగాయని, 35 కొమ్మలు విరిగిపడ్డాయని వివరించారు. ఏదైనా సంఘటన జరిగితే తక్షణం 1533 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి వెంట పాలికె పరిపాలన అధికారి ఉమాశంకర్, చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులు ఉన్నారు.



పిల్లలతో వర్షంలో వెళ్తున్న మహిళ

తుమకూరులో కుండపోత

తుమకూరు: తుమకూరు నగరంలో కుండపోత వర్షం కురవడంతో నగరంలోని రహదారులు చెరువులను తలపించాయి. ద్విచక్రవాహనంలో మహిళ పిల్లలను ఎక్కించుకొని వర్షం నీటిలో ప్రయాణిస్తున్న దృశ్యం.



వర్షంలో పరిగెడుతున్న ప్రయాణికుడు

రిజర్వేషన్లు అమలు చేయాలని ఆందోళన

తుమకూరు : సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర మాదిగ సంఘాల ఒక్కూట నేతృత్వంలో బుధవారం వివిధ మాదిగ సంఘాల ప్రతినిధులు తుమకూరు నగరంలో ధర్నా నిర్వహించారు. ఈ నెల 18న జరిగే మంత్రివర్గ సమావేశంలో రిజర్వేషన్లకు సంబంధించిన విషయాన్ని చర్చించి ఆమోదం తెలపాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రితో పాటు మంత్రులను ఘెరావ్ చేస్తామన్నారు. నల్లజెండా ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టి పోరాటాలు తీవ్రరూపం చేస్తామని మాదిగ సంఘటనల ప్రతినిధులు హెచ్చరించారు. ధర్నాలో తుమకూరు రూరల్ ఎమ్మెల్యే సురేష్‌గౌడ, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, గుబ్బి జేడీఎస్ నాయకుడు నాగరాజు, జిల్లా పంచాయితీ మాజీ సభ్యుడు జగన్నాథ్, పి.ఎన్.రామయ్య హనుమంతరాయప్ప, మాదిగ దండోరా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో ఈనాడు

- ఉదయం 10.30 గంటల నుంచి కర్ణాటక చిత్రకళా పరిషత్తులో హస్తకళా వస్తువుల ప్రదర్శన కొనసాగుతుంది.
- మధ్యాహ్నం 3.30 గంటలకు క్వీన్స్ రోడ్డులోని కాంగ్రెస్ భారత్ జోడో భవన్‌లో జరిగే కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్ పాల్గొంటారు.

– న్యూస్‌టుడే,బెంగళూరు (యశ్వంతపుర)

బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కుటుంబ సభ్యులకు బుధవారం ఇక్కడ కె.ఎస్.ఆర్టీసీ కార్యాలయంలో రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి పరిహారం కింద చెక్కులు పంపిణీ చేశారు. 93 మందికి పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కె.ఎస్.ఆర్టీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహ్మద్ రిజ్వాన్ నవాబ్, శాసనసభ్యుడు ఎన్.ఎ.హ్యారీస్, రవాణా శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.వి.ప్రసాద్, ఎండీ అన్బుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి రామలింగారెడ్డి తదితరులు

63 అడుగుల రామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : రాజాజీనగర రామమందిరంలో శ్రీరామ సేవా మండలి 63 అడుగుల రామాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాగడి కెంపేగౌడ అభివృద్ధి సమితి అధ్యక్షుడు హెచ్.ఎం.కృష్ణమూర్తి, సేవా మండలి అధ్యక్షుడు కె.ఎస్.శ్రీధర్, పాలికె మాజీ సభ్యుడు మోహన్‌కుమార్ మాట్లాడారు. ఉడుపి పేజావర మఠం విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ, ఆదిచుంచనగిరి నిర్మలానందనాథ స్వామీజీ నేతృత్వంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, కేంద్రమంత్రులు వి.సోమణ్ణ, శోభాకరంద్లాజే, మంత్రులు రామలింగారెడ్డి, దినేష్‌గుండూరావు, గ్యారంటీ పథకం సమితి రాజ్యాధ్యక్షుడు హెచ్.ఎం.రేవణ్ణ, ఎమ్మెల్యే సి.ఎస్.అశ్వత్థనారాయణ, కె.గోపాలయ్య, సుధాంషు త్రివేది పాల్గొనున్నారు. ధర్మస్థల ధర్మకర్త వీరేంద్రహెగ్గడే మార్గదర్శకంలో ఈ కార్యక్రమం జరుగనుంది. మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప, నటులు శివరాజ్‌కుమార్, రమేష్‌అరవింద్, మురళీ, భాజపా ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్, రాజ్యాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితర రాజకీయ ప్రముఖులు పాల్గొంటారు. సమావేశంలో ఆలయం పాలనామండలి పదాధికారులు మంజునాథస్వామి, కె.వెంకటేష్‌బాబు, ఎం.జి.జయరత్న, భాగ్యలక్ష్మి, ఎన్.బాబు, మహేష్, కె.ఆర్.విజయరాఘవన్, టి.పి.భరత్, భైజురామ్, బి.ఎల్.సురేష్, ఆర్.రమేష్, ఎన్.జయరామ్, శివరాజ్‌శెట్టి, బసవరాజ్ పాల్గొన్నారు.



రామాంజనేయుల విగ్రహం ముందు నిర్వాహకులు

కె.జి.హళ్లిలో నాగదేవతలకు పూజలు



అశ్వర్థకట్టకు పూజలు చేస్తున్న మహిళలు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : కమ్మగుండనహళ్లిలోని శ్రీరామ దేవాలయం వద్ద అశ్వర్థకట్ట జీర్ణోద్ధరణ చేసి 48 రోజులు కావటంతో ఇక్కడ ప్రతిష్ఠించిన నాగదేవతలకు జన జాగృతి మహిళా సంఘం అధ్యక్షురాలు హేమావతి దేవేగౌడ అధ్వర్యంలో పూజలు చేశారు. పూజల్లో గ్యారంటీ కమిటి ఛైర్మన్ కె.సి.వెంకటేష్, సంఘం ప్రధాన కార్యదర్శి ప్రేమా, సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెరగాలి


బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆధునిక సమాజంలో ఆహారం కల్తీ కావడంతో మనిషి జీవితం తక్కువవుతున్నందున రైతులకు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెంచాల్సిన బాధ్యత వ్యవసాయ విశ్వవిద్యాలయాలపై ఉందని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కె.హెచ్.మునియప్ప తెలిపారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడ జీకేవీకే ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమం, ఆహార పదార్థాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వందేళ్లు పైగా జీవించే వ్యక్తి ప్రస్తుతం రసాయనిక ఎరువులతో పండించిన ఆహార పదార్థాల వల్ల 70 ఏళ్లు జీవించడం కష్టంగా ఉందన్నారు. మనిషికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడానికి సేంద్రియ పంటలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీని వల్ల పరిసరాలు నాశనం కాకుండా అదుపులోకి వస్తాయన్నారు. ప్రపంచ ఆకలి చావుల్లో భారతదేశం 111 స్థానంలో ఉందన్నారు. దేశంలో ఆకలి చావులు లేకుండా అందరికీ ఆహారం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట దిగుబడిపై వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరిశోధనలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్, పాలక మండలి సభ్యులు డాక్టర్ టి.కె.ప్రభాకరశెట్టి, డాక్టర్ ఎం.చంద్రగౌడ, డాక్టర్ హెచ్.ఎల్.హరీశ్, డాక్టర్ కె.సి.నారాయణస్వామి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.ఎల్. మధుప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్.శివరాం తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న మంత్రి మునియప్ప తదితరులు

జేడీఎస్ సీనియర్ నాయకుడి కన్నుమూత

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని లింగదహళ్లి గ్రామానికి చెందిన జేడీఎస్ సీనియర్ నాయకుడు ఎల్.ఎస్.నరసరెడ్డి (80) బుధవారం ఉదయం తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు సణ్ణారెడ్డి తాలూకా జేడీఎస్ పార్టీ నాయకుడు. నరసరెడ్డి మృతికి జేడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.సి.అంజినప్ప, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, తాలూకా అధ్యక్షుడు ఎన్.ఎ.ఈరణ్ణ, బి.హొసహళ్ళి వసంతరెడ్డి తాలూకాలోని నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.



ఎల్.ఎస్.నరసరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

చింతామణి, న్యూస్‌టుడే : కెంచార్లహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధి మదనపల్లె రోడ్డు దండుపాళ్య గేట్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతమంగళకు చెందిన వివాహిత తరునం (22) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమె భర్త అయాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కదిరి నుండి విజయపురకు వెళుతున్న బొలెరో వాహనం బేతమంగళకు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనింది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న తరునం ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. బొలెరోలో ప్రయాణిస్తున్న కదిరికి చెందిన ఆదెప్ప, ఫక్రుద్దీన్, సబీనా, ఆజాద్, షబానా, షోయబ్, సలీమ్ గాయపడగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కెంచార్లహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జరిమానా

చింతామణి, న్యూస్‌టుడే : చెక్‌బౌన్స్ కేసులో చింతామణి టీఏపీసీఎంఎస్ సంస్థకు 1,22,50,000 రూపాయలు జరిమానా చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. కిప్కో సంస్థ టీఏపీసీఎంఎస్‌కు 200 టన్నుల ఎరువు సరఫరా చేసినందుకు రూ.61.25 లక్షల చెక్కును ఇచ్చింది. చెక్కు బౌన్స్ కావడంతో కిప్కో సంస్థ బెంగళూరులోని ఏసీఎంఎం కోర్టులో దావా వేసింది. విచారణ చేసిన న్యాయస్థానం జరిమానా, లేని పక్షంలో సంస్థ అధ్యక్షుడు, కార్యదర్శి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఆదేశించింది.

పశువుల దొంగల అరెస్టు

శివాజీనగర : నగర శివారు ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకలు దొంగిలించి వాటిని హొసపేట, కొప్పళ, బళ్లారి తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఆరుగురు చోరులను చిక్కజాల ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. యాదగిరి నివాసి పరశురామ (28), సింధనూరు నివాసులు అమరేశ్ (27), రమేశ్ (21), వెంకటేశ (19), బాగలకోటె నివాసి హులిగప్ప (32), హుబ్బళ్లి నివాసి ఈరణ్ణ (27)లను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.11.99 లక్షల విలువైన 29 గొర్రెలు, పది ఆవులు జప్తు చేసుకున్నామని డీసీపీ సజిత్ తెలిపారు.

పోలీసుల అదుపులో చరవాణుల దొంగ

రద్దీ ప్రదేశాలు, బస్సుల్లో చరవాణులు దొంగిలిస్తున్న అలీవ్ (34) అనే నిందితుడ్ని హెచ్ఏఎల్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. మారతహళ్లి పరిధి కుందలహళ్లిలో చరవాణిని విక్రయించే ప్రయత్నంలో పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రూ.4 లక్షల విలువైన 11 చరవాణులు జప్తు చేసుకున్నారు. ఇతనితో కలిసి దొంగతనం చేస్తున్న మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ద్విచక్రవాహన చోరుడు..

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఇళ్ల ముందు నిలిపి ఉంచిన బైకులను దొంగిలించి, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్న రఘునందన్ (22) అనే చోరుడ్ని బనశంకరి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.1.25 లక్షల విలువైన నాలుగు బైకులు జప్తు చేసుకున్నారు. గతంలోనూ వాహనాలను దొంగిలించి, విక్రయించి సొమ్ము చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

యువకుడి బలవన్మరణం

బెంగళూరు (శివాజీనగర) : ఉద్యోగం కోసం నగరంలో చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో వేణు (28) అనే యువకుడు బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. తాను ఉంటున్న పీజీ నాల్గవ అంతస్తు నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తమిళనాడుకు చెందిన వేణు గత రెండు నెలలుగా పీజీలో ఉంటూ, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడని పరప్పన అగ్రహార ఠాణా పోలీసులు తెలిపారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

చాక్లెట్లు 'మత్తు'.. తింటే చిత్తే

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఒంటరిగా వెళుతున్న ప్రయాణికులతో పరిచయం పెంచుకుని, వారికి మత్తు పదార్థాన్ని నింపిన చాక్లెట్టు, బిస్కట్లు ఇచ్చి, నగలు, నగదు దోచుకుని పరారవుతున్న లత అనే మహిళను బ్యాటరాయపుర రాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మత్తు ఇచ్చి నిలువు దోపిడీకి ప్రయత్నిస్తున్న ఆమెను కొందరు ప్రయాణికులు పట్టించి పోలీసులకు అప్పగించారు. రాణాకు తీసుకువచ్చిన అనంతరం తన వద్ద ఉన్న ఒక విష లేపిత చాక్లెట్టును నోట్లో వేసుకుని.. కిందపడిపోయింది. ఆమెను విక్టోరియా ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. నిందితురాలికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. నిందితురాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినట్లు వెల్లడించిన పోలీసులు.. పూర్తి వివరాల కోసం ఆరాతీస్తున్నారు.

రేణుకాస్వామికి పుత్రయోగం

చిత్రదుర్గం : ఆ దంపతులది ఓ విషాదగాథ. తాను ఎంతగానో అభిమానించే కథానాయకుడు దర్శన్, ఆయన ప్రియురాలు దర్శన్ చేతిలో రేణుకాస్వామి కడతేరిపోయాడని పోలీసులు నమోదు చేసుకున్న కేసు రాష్ట్రంలో పెను సంచలనం సృష్టిస్తున్న క్రమంలో ఈ అంశంలో మరో అంకం ప్రజలను కదిలించింది. స్వామి మరణించే నాటికి ఆయన భార్య సహన ఐదు నెలల గర్భిణి. కొత్తగా పెళ్లైన ఆ జంటకు తోడుగా ఓ చిన్నారి ఒడిలోకి వచ్చే సమయంలో స్వామి హతమయ్యాడు. భర్త లేని బిరుసున బిగించి జీవితాన్ని నెట్టుకొస్తున్న ఆమె.. బుధవారం ఓ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు చిత్రదుర్గంలో ఆమెకు వైద్యసేవలందించిన డాక్టర్ మల్లికార్జున విలేకరులకు వివరించారు.


రేణుకాస్వామి, సహన (పాతచిత్రం)

వర్గీకరణ కోరుతూ డీసీఓ ముట్టడి యత్నం

రాయచూరు, న్యూస్‌టుడే : దళిత వర్గీకరణ చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవటానికి 'అంతర్గత రిజర్వేషన్ ఐక్య పోరాట సమితి' బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం ముట్టడికి యత్నించింది. బ్యారికేడ్లను దాటుకుని కార్యాలయంలోకి చొచ్చుకుని పోయేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోరు తీవ్రం కాకుండా ఉండేందుకు పోలీసులు నిరసనకారులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం విడుదల చేశారు. జిల్లా పాలనాధికారి కార్యాలయం ప్రధాన రహదారి కావడంతో కొద్ది సేపు సంచారం అస్తవ్యస్తమైంది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ధర్నా చేశారు. వర్గీకరణ జారీ చేయడంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉదాసీనవైఖరి అవలంబిస్తున్నారని ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతినిధులు విరూపాక్షి, అంబణ్ణ అరోలి, నరస్సు మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో సర్కారు జాప్యం చేస్తున్నందునే పోరాట మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా స్పందించకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా పాలనాధికారి కార్యాలయం ముట్టడి వరకు ర్యాలీగా వెళ్లారు. ఆందోళనకు తిమ్మప్ప ఫిరంగి, భీమణ్ణ మంచాల, పి.యల్లప్ప, సుభాష్ అస్కిహాళ్, షంషాలం, రామచంద్ర బొరెడ్డి తదితరులు నేతృత్వం వహించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు.


కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆందోళనకారులు


నిరసనకారులను వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

రాజధాని శివార్లకూ శుద్ధజలం


రిబ్బను కత్తిరిస్తున్న హోకుగో క్యూకో.. చిత్రంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

మండ్య, న్యూస్‌టుడే : బెంగళూరులో తాగునీటి సమస్యల పరిష్కారానికి కావేరి ఐదవ స్టేజ్ ద్వారా నీటిని అందిస్తున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ఉద్యానగరిలో 110 గ్రామాలు చేరిన అనంతరం, నగరం నాలుగు దిశలా విస్తరించిందని కావేరి నీటికి కొరత ఎదురైందన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన కావేరి ఐదవ దశ పనులను, మళ్లీ తన హయాంలోనే పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. మళవళ్లి తాలూకా తొరెకాడనహళ్లిలోని జలమండలి ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి మీట నొక్కి బుధవారం ప్రారంభించారు. దేశంలో మూడో అతి పెద్ద నగరం.. బెంగళూరులో నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బెంగళూరులో 1896 వరకు ధర్మాంబుధి, సంపంగి, హలసూరు, స్యాంకి చెరువుల నుంచి తాగునీరు సరఫరా చేసేవారని గుర్తు చేశారు. నగర జనాభా పెరగడంతో 1974 నుంచి కావేరి నుంచి నీటిని నగరానికి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. తదుపరి సంవత్సరాల్లో మరో మూడు దశల్లో జలమండలి నీటిని నగరానికి తీసుకువచ్చిందన్నారు. మహానగర పాలికెలో 110 గ్రామాలు చేరడం, జనాభా 1.4 కోట్లను దాటడంతో కొత్తగా పథకాన్ని చేపట్టామని, ఇప్పటికే నిత్యం 2,200 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసేందుకు ఈ పథకాన్ని పూర్తి చేశామని వివరించారు. ఐదో దశ పథకంతో నగరానికి కొత్తగా 775 ఎంఎల్‌డీ నీరు లభిస్తుందన్నారు. పథకాన్ని పూర్తి చేసేందుకు రూ.4,333 కోట్లు అవుతుందని అంచనా వేయగా, జపాన్ కోఆపరేషన్ ఏజెన్సీ సహకారంతో 2018లో పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. మేకెదాటు ప్రాజెక్టు పూర్తి చేస్తే నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ పథకానికి అనుమతులు ఇప్పించే అవకాశం ఉన్నా.. మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. కావేరి ఆరో దశ పనులను చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించానని చెప్పారు.


సత్కారం అందుకున్న జపాన్ దేశ ప్రతినిధులు హోకుగో క్యూకో, టేకుచి టకురో, ట్సుటోము నకానె


నీటికి వాయనం సమర్పిస్తున్న సిద్ధరామయ్య


హారోహళ్లి సమీపంలో నిర్మించిన ఎత్తిపోత కేంద్రం

ఇచ్చిన హామీని నెరవేర్చే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ప్రతి ఏటా రూ.4 లక్షల కోట్లను పన్నుగా చెల్లిస్తున్నా, కేంద్రం నుంచి వస్తున్న నిధులు నామమాత్రంగానే ఉన్నాయని తెలిపారు. కర్ణాటక 100 పైసలు ఇస్తే, కేంద్రం 15 పైసలు మాత్రమే విడుదల చేస్తుందని సభికులకు వివరించారు. ఈ అన్యాయాన్ని భాజపా నాయకులు నోరు మెదపడం లేదని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు కేజే జార్జ్, చెలువరాయస్వామి, ఎమ్మెల్యేలు బైరతి బసవరాజు, ఎస్‌టీ సోమశేఖర్, ఎస్ఆర్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ టీఏ నాగరాజు, నరేంద్రస్వామి, రవి, దినేశ్ గూళిగౌడ తదితరులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సహకారం అందించిన జపాన్ దేశ ప్రతినిధులు, ఉన్నతాధికారులు హోకుగో క్యూకో, టేకుచి టకురో, ట్సుటోము నకానెలను ఇదే సందర్భంగా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఘనంగా సత్కరించారు.

ఆన్‌లైన్ జూదాలను నిషేధించాలి

రాయచూరు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వెబ్‌సైట్లను నిషేధించాలని 'నమ్మ కర్ణాటక సేన' కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు కె.కొండప్ప నాయకత్వంలో జిల్లా పాలనాధికారి కార్యాలయం ముఖ ద్వారం వద్ద ప్రదర్శనకు దిగారు. కొంత సేపటికి సంబంధిత అధికారికి వినతి పత్రం ఇచ్చారు. జూదాలు ఆడిన వారి కుటుంబాలు ఎలా నాశనమవుతున్నాయో అందులో వివరించారు. ఆస్తులు పోగొట్టుకుని, అప్పులు చేసిన కొందరు బలవన్మరణాలకు పాల్పడం చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, విద్యార్థులు, యువత వాటికి ఆకర్షితులై, వ్యసనంగా మార్చుకుని బంగారు భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారన్నారు. అనధీకృత వెబ్‌సైట్ల మాయలో చిక్కుకొని మోసపోయిన ఘటనలు జరిగాయని వివరించారు. వాటిపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. పోరాటానికి ప్రతినిధులు ఎం.ఎస్.వెంకటేష్, మహేశ్ పాటిల్, విజయ్, రామకృష్ణ, వీరేశ్ జలగార నేతృత్వం వహించారు.


నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన ఎల్‌వీడీ

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు విశ్వవిద్యాలయం అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక ఎల్‌వీడీ కళాశాల విద్యార్థుల జట్టు ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇక్కడి ఎల్‌వీడీ కళాశాల మైదానంలో ఈ నెల 15, 16వ తేదీల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో పలు కళాశాలల జట్లు పాల్గొన్నాయి. బుధవారం విజేతలను ప్రకటించారు. ఎల్‌వీడీ విద్యార్థులు ప్రథమ, వేదాంత కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. విద్యార్థినుల విభాగంలో ఎల్‌వీడీ తొలి, బీఆర్‌బీ కళాశాల రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఎల్‌వీడీ జట్లను తారనాథ్ విద్యా సంస్థల అధ్యక్షుడు సుఖాని, ఉపాధ్యక్షుడు పవనకుమార్ సుఖాని, ప్రధాన కార్యదర్శి నందాపుర శ్రీనివాసరావ్, సంయుక్త కార్యదర్శి అంబాపతి పాటిల్, మండలి కార్యదర్శి జట్రం శ్రీనివాస్, వ్యాయామ విద్య నిర్దేశకుడు సంపత్ అంగడి, ధనుంజయ అభినందించారు.


ట్రోఫీ అందుకుంటున్న ఎల్‌వీడీ విద్యార్థులు

ఈడీపై నాగేంద్ర నిప్పులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అక్రమాలకు- తనకు ఎటువంటి సంబంధం లేదని మాజీ మంత్రి బి.నాగేంద్ర స్పష్టం చేశారు. ఈ అక్రమాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వాటా ఉందని చెప్పాలని తనపై ఈడీ అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి వేధించారని ఆరోపించారు. అరెస్టయిన మూడు నెలల అనంతరం న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంతో పరప్పన అగ్రహార కారాగారం నుంచి బుధవారం ఆయన విడుదలయ్యారు. ఈడీ ఇప్పటికే అభియోగపత్రాన్ని దాఖలు చేసిందని, విచారణకు హాజరై తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని నాగేంద్ర చెప్పారు.

మునిరత్నకు బంధ విముక్తి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: అత్యాచారం, హనీట్రాప్ చేయించిన ఆరోపణలతో అరెస్టయిన మాజీ మంత్రి, రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్నకు చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంతో పరప్పన అగ్రహార కారాగారం నుంచి బుధవారం విడుదలయ్యారు. ఆయన అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికి, వయ్యాలికావల్‌లోని నివాసానికి తీసుకువెళ్లారు. మిఠాయిలు పంచి పెట్టి, బాణసంచా కాల్చి వేడుకలు చేసుకున్నారు.

దర్శన్‌కు బెయిల్ ఎన్నడో?

బెంగళూరు (మల్లేశ్వరం): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన నటుడు దర్శన్ బెయిలు కోసం వేసుకున్న అర్జీని 57వ సీసీహెచ్ న్యాయస్థానం తోసిపుచ్చడంతో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దర్శన్ వెన్నునొప్పి సమస్యలను ఎదుర్కొంటున్నాడని, బెయిలు మంజూరు అర్జీని త్వరగా విచారించాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది సీవీ నాగేశ్ బుధవారం మెమో దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణ చేపట్టడం సాధ్యం కాదని పేర్కొన్న న్యాయస్థానం అక్టోబరు 22న ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

జై శ్రీరాం అంటే తప్పేముంది?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మసీదు సమీపంలో 'జై శ్రీరాం' అని నినాదాలు చేస్తే ఎవరి ధార్మిక భావనలూ దెబ్బతినవని జస్టిస్ ఎం.నాగప్రసన్న పేర్కొన్నారు. దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకాలోని ఒక మసీదు ఆవరణలోకి వచ్చిన కీర్తన్, సచిన్ అనే యువకులు 'జైశ్రీరాం' అంటూ నినాదాలు చేశారు. మత పెద్దల ఫిర్యాదుతో కడబ ఠాణాలో వారిపై కేసు నమోదైంది. వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయనిర్బంధానికి పంపిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. ఆ ఆదేశాలను ప్రశ్నిస్తూ వారిద్దరూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కడబ, చుట్టుపక్కల ప్రాంతాల్లో హిందూ, ముస్లింలు సౌహార్ద్రతతో జీవిస్తున్నారని, మసీదు ఆవరణ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒక ధర్మానికి చెందిన నినాదాలు చేయడం ధార్మిక నమ్మకాలు, భావనలను అవమానించడం కిందకు రాదని ప్రకటించిన న్యాయమూర్తి, వారిని కారాగారం నుంచి విడుదల చేయాలని ఆదేశించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకా

రాయచూరు, న్యూస్‌టుడే : పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20, 21 తేదీల్లో టీకా ఇచ్చే కార్యక్రమం జరుగుతుందని జిల్లా పాలనాధికారి కె.నితీష్ తెలిపారు. ప్రతి రైతు పశువులకు టీకా వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా పశుపాలనా, పశు వైద్య సేవా శాఖ, పశు రోగ నియంత్రణ జాతీయ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు టీకా వేస్తోంది. ఇందుకు సంబంధించి బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ప్రచార గోడపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం నితీష్ మాట్లాడుతూ గ్రామాల్లోకి వచ్చే పశు వైద్యులు, సిబ్బందికి సహకరించాలన్నారు. మూడు నెలల పైన వయసు ఉన్న గేదెలకు వ్యాక్సిన్ ఇప్పించాలని సూచించారు. టీకా వల్ల పశువులు రోగాల బారిన పడవని తెలిపారు. గతంలో ఐదుసార్లు నిర్వహించిన వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగస్వామ్యమైనట్లే ఈ సారి కావాలని కోరారు. పశుపాలనా, పశు వైద్య సేవా శాఖ ఉప నిర్దేశకుడు అశోక్ కోలకార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.


గోడ పత్రాన్ని విడుదల చేసిన నితీష్ తదితరులు

మణగూరు-బెళగావి రైల్వే సేవలు ప్రారంభం

రాయచూరు, న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక, ఉత్తర కర్ణాటక ప్రజలకు శుభవార్త. ప్రధాన పట్టణాలైన యాదగిరి, రాయచూరు నుంచి బళ్లారి, విజయనగరం, కొప్పళ, గదగ్, హుబ్బళి, బెళగావి జిల్లాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు రైల్వే సదుపాయం లభించింది. 2019లో కరోనా విజృంభణ వేళ నిలిపివేసిన మణగూరు-బెళగావి (రైలు సంఖ్య 07336), బెళగావి-మణగూరు (రైలు సంఖ్య 07335) మధ్య రైల్వే సేవలను పునరుద్ధరించారు. నాలుగు రోజులు సంచరిస్తాయి. మణగూరులో సోమవారం, బుధవారం, గురువారం, ఆదివారం, బెళగావిలో మంగళవారం, బుధవారం, శనివారం, ఆదివారం బయలుదేరుతాయి. బుధవారం మధ్యాహ్నం 3.40 గంటలకు మణగూరులో బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున 3.38 గంటలకు రాయచూరుకు చేరింది. మంత్రాలయం, కోసిగ్గి, ఆదోని, గుంతకల్, బళ్లారి, దరోజి, తోరణగల్, హొస్పేట, కొప్పళ, గదగ్, హుబ్బళి మీదుగా బెళగావికి సాయంత్రం 4 గంటలకు చేరాలి. బెళగావిలో మధ్యాహ్నం 12.30 గంటలకు వదులుతుంది. రాయచూరుకు రాత్రి 11.28 గంటలకు వస్తుంది. మణగూరుకు మరుసటి రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరాలి. ఐదేళ్ల క్రితం వరకు మణగూరు- కొల్హాపూరు(వయా బెళగావి), కొల్హాపూరు-మణగూరు మధ్య తిరిగేవి. వీటిని బంద్ చేయడంతో బళ్లారి వెళ్లేందుకు నేరుగా రైలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గుంతకల్ వరకు పోయి అక్కడి నుంచి వెళ్లే వారు. అత్యవసర పనులు ఉన్న వారు రహదారి మార్గం దూరమైనా అనివార్యంగా బస్సులను ఆశ్రయించే వారు. ఎట్టకేలకు పాత రైళ్లనే నడపటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాయచూరు రైల్వే స్టేషన్

కొల్హాపూరు వరకు పొడిగించాలి

-గొడవర్తి బ్రహ్మయ్య చౌదరి



గతంలో ఇదే రైలు కొల్హాపూర వరకు వెళ్లేది. దేశంలో పురాతనమైన కొల్హాపూర మహాలక్ష్మి దేవస్థానానికి వెళ్లే తెలంగాణ, కర్ణాటక భక్తులకు అనువుగా ఉండేది. ప్రస్తుతం బెళగావికి వెళ్లి అక్కడి నుంచి మహాలక్ష్మి దేవస్థానానికి చేరుకోవాలంటే సమయం వృథా అవుతోంది. కనుక కొల్హాపూర వరకు పొడిగించాలి. గత కొన్నేళ్లుగా కలబురగికి వెళ్లి అక్కడి నుంచి కొల్హాపూరుకు వెళుతున్నారు.


ఏనుగుపై శాంభవీమాతను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా శాంభవీమాత ఉత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని కరేగుడ్డ గ్రామంలో మహంతేశ్వర మఠం ఆధ్వర్యంలో శాంభవీమాత ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మఠం నిర్వాహకులు మహంతలింగ శివాచార్య స్వామీజీ మఠంలో పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఏనుగు పై అమ్మవారి విగ్రహాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించారు. కరేగుడ్డ, పోత్నాళ, బ్యాగవాట, బాగలవాడ, నక్కుంది, పార్వతమ్మక్యాంపు, వెంకటేశ్వర క్యాంపులకు చెందిన ప్రజలు అమ్మవారి ఉత్సవంలో పాల్గొన్నారు. సిద్ధలింగమహాస్వామి, బసవలింగమహాస్వామీజీ, తోంటదార్యమహాస్వామీజీ, శాంతమల్ల స్వామీజీ, మైసూరు నిరంజన్‌దేవరు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమ పూజలు

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక జైసంతోషిమాత దేవస్థానం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయ ప్రాంగణంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పూర్ణాహుతి పూజ, దుర్గా హోమ పూజలు చేశారు. హుబ్బళ్లికి చెందిన పండితులు జి.కె.సత్యమూర్తి సాన్నిధ్యంలో హోమ పూజలు జరిగాయి. జైసంతోషిమాత దేవస్థాన సమితి అధ్యక్షుడు ద్యాసనూరు రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి మన్నాలి వెంకయ్యశెట్టి, ఉపాధ్యక్షులు ఆర్.శివశంకరశెట్టి, ఎం.ఆర్.రాము, ఆర్యవైశ్య సముదాయం ప్రముఖులు పాల్గొన్నారు.

మనసున్న మా రాజు రతన్ టాటా

రాయచూరు, న్యూస్‌టుడే : ఇటీవల మృతి చెందిన టాటా గ్రూప్స్ ఛైర్మన్ రతన్ టాటాకు బుధవారం నవోదయ కళాశాల సభా భవన్‌లో శ్రద్ధాంజలి నిర్వహించారు. విద్యా సంస్థల రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్ దివంగత టాటా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ దేశం ఒక మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతిని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని, ఇంకా దుఃఖసాగరంలోనే మునిగిపోయారని తెలిపారు. ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు దక్కించుకోవాలని ఏ నాడు ఆరాట పడలేదని, సంపదలో ఎక్కువ శాతాన్ని సమాజ సేవకు వెచ్చించిన నిలువెల్లు మానవతామూర్తి అని కొనియాడారు. టాటా ఆదర్శ జీవితాన్ని అందరూ ఒక పాఠంగా తీసుకుని సేవాభావం పెంపొందించుకోవాలని కోరారు. నవోదయ కేంద్ర విద్యాలయం డైరెక్టర్ లలితా భాటియా మాట్లాడుతూ రతన్ నిరాడంబరత, వినయ విధేయతలను దగ్గర నుంచి చూసి ఆశ్చర్యపోయాయన్నారు. కరోనా సమయాన టాటా కంపెనీల్లో పనిచేసే ఏ ఒక్క ఉద్యోగిని తొలగించని మనసున్న గొప్ప మనిషి అని పేర్కొన్నారు. నవోదయ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ భారత్ శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతిలో టాటా పాత్ర ఉందని వివరించారు. ఉద్యోగులు, కార్మికులకు 8 గంటల పని వేళల చట్టాన్ని తన సంస్థల్లో తొలుత అమలు చేసి ఇతర కంపెనీలు, పరిశ్రమలకు స్ఫూర్తి ఇచ్చారని ప్రశంసించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవానంద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ దాక్టర్ దొడ్డయ్య ప్రసంగించారు.


టాటాకు నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్

దావణగెరె బంద్ సంపూర్ణం

దావణగెరె, న్యూస్‌టుడే : కర్ణాటకలోని మొదటి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల 'యూబీడీటీ'లో 50 శాతం సీట్లను పేమెంట్ కోటాకు తీసుకురావడాన్ని ఖండిస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాలు దావణగెరెలో బుధవారం బంద్ ఆచరించాయి. ధర్నాకు కన్నడ, వ్యాపారుల, నివాసుల, హోటళ్ల, ప్రైవేటు ట్రావెల్స్, ఆటో, క్యాబ్ సంఘాలు మద్దతు ఇచ్చాయి. మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు నామమాత్రంగానే కనిపించాయి. ప్రభుత్వమే మేనేజ్‌మెంట్ కోటాను తీసుకువచ్చి యూబీటీడీ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆందోళనకు నేతృత్వం వహించిన విద్యార్థి నేత అజయ్ కామత్ ధ్వజమెత్తారు. ఫీజుల పెంపు, సగం సీట్లను విక్రయించుకోవడం ద్వారా పేద విద్యార్థులకు అన్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. జిల్లాధికారి కార్యాలయం వైపు వెళుతున్న ఆందోళనకారుల్లో 30 మందిని పోలీసులు బంధించి, ఠాణాకు తీసుకువెళ్లారు. వ్యక్తిగత పూచీకత్తుపై సాయంత్రం వారిని విడుదల చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని తీవ్రం చేస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు.



ఆందోళనలో కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాల ప్రతినిధులు

నియంత్రణ తప్పిన క్రషర్ వాహనం

రాయచూరు, న్యూస్‌టుడే : వేగంగా వెళ్తున్న క్రషర్ వాహనం నియంత్రణ తప్పి పొలంలోకి దూసుకెళ్లిన ఘటన బుధవారం రాయచూరు తాలూకా కెరెబూదూరు గ్రామం సమీపం జాతీయ రహదారిపై జరిగింది. ఇడపనూరు పోలీస్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. వాహనంలో ఉన్న వారికి చిన్నపాటి, చోదకుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. క్రషర్ ముందు భాగం దెబ్బతినింది. యాదగిరి జిల్లా సైదాపూరు నుంచి మంత్రాలయానికి వెళుతుండగా ప్రమాదానికి గురైంది. ఐదు రోజులుగా నిత్యం జిల్లాలో దుర్ఘటనలు జరగడం ఆందోళన కల్గిస్తోంది.


దెబ్బతిన్న వాహనం

నామినేషన్ల స్వీకరణ

మాన్వి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నిర్వహించే ఎన్నికకు సంబంధించి నామపత్రాల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024-29 తాలూకా, యోజనా శాఖల డైరెక్టర్ స్థానాలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రమోద్ కులకర్ణి తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అవకాశముందన్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 21 వరకు ఉపసంహరణకు వీలుంది. 28న ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. తాలూకాలోని 21 శాఖలకు చెందిన 936 మంది ఓటర్లు 34 మంది డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.


నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ఉద్యోగులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

16-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1613.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	24,465	749
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	25,189	9,358
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.788	45.562

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మాతా, శిశు ఆసుపత్రి తనిఖీ

మాన్వి, న్యూస్‌టుడే : జిల్లా పాలనాధికారి నితీశ్ బుధవారం సాయంత్రం పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులను ఆయన పరిశీలించారు. ఔషధాలయంలో మందులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో స్వచ్ఛత, తాగునీటి వ్యవస్థ, రోగులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సురేంద్రబాబు, తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవపాటిల్, వైద్యుడు శరణబసవ తదితరులు పాల్గొన్నారు.


రోగితో మాట్లాడుతున్న జిల్లాపాలనాధికారి నితీశ్ కె

వారికీ.. బెయిల్ నిరాకరణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో కారాగారం చేరిన ముగ్గురు నిందితులు వేసుకున్న బెయిలు అర్జీని 57వ సీసీహెచ్ కోర్టు న్యాయమూర్తి జైశంకర్ తోసిపుచ్చారు. హత్య కేసులో ఏ3 పవన్, ఏ10 వినయ్, ఏ14 ప్రదోశ్‌లు బెయిలు కోరుతూ అర్జీ వేసుకున్నారు. వారికి బెయిలు ఇవ్వవద్దని ప్రభుత్వ ప్రత్యేక న్యాయమూర్తి ప్రసన్న కుమార్ వాదనలు వినిపించారు. ఇప్పటికే బెయిలును తిరస్కరించడంతో ఈ కేసులో ఏ1గా ఉన్న నటి పవిత్రాగౌడ ఉన్నత న్యాయస్థానంలో బెయిలు కోసం బుధవారం అర్జీ వేసుకున్నారు.